ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

ఆదివారం 04 అక్టోబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 170
Sunday 04 octobar 2026 | Vol.No 28 Issue No .170
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in



## తెలంగాణలో బతుకమ్మ సందడి షురూ..

### ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సౌరభానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలకు రాష్ట్రం ముస్తాబవుతోంది. పూలను పూజించే ఏకైక పండుగగా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మిగతా 2లో..

విజన్ ఆంధ్ర - స్పెషల్ స్టోరీ....

### ఈఎంఐల భయంతో

## బతుకు భారం

- మానసిక ప్రశాంతత కోల్పోతున్న సామాన్యులు!
- ఒకట్రెండు వాయిదాలు ఆలస్యమైతే చాలు
- రోజుకు 15 సార్లు ఫోన్లు - ఇంటికొచ్చి బెదిరింపులు
- లైఫ్ ఇన్సూరెన్స్ ల పేరుతో ఉదయాన్నే వేధింపులు
- అధికారులు, వ్యాపారులకు తలనొప్పిగా మారిన ఫైనాన్స్ కాల్స్

మిగతా 2లో..



## ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ ప్రారంభించాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులపై వారానికోసారి సమీక్ష
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై పకడ్బందీ ప్రణాళిక

మిగతా 2లో..

## ఆసియా క్రీడల్లో భారత్ జోరు

- 21 స్వర్ణాలు సహా 85 పతకాలు
- 4వ స్థానంలో నిలిచిన భారత్
- చివరిరోజూ భారత్ పథకాల పంట
- హాకీలోనూ 'డబుల్ గోల్డ్' కైవశం
- పురుషుల స్వర్ణం కూడా కైవసం
- ఫైనల్‌లో మలేషియాపై విజయం
- ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు

మిగతా 3లో..




### పిల్లల సైబర్ భద్రతకు

## ప్రభుత్వం పూర్తి మద్దతు

- ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించాలి
- ప్రతి గ్రామానికి న్యాయ సేవల కార్యక్రమాలు.. బాధితులకు అండగా నిలవాలి
- 1930, 1098 హెల్ప్‌లైన్ నంబర్లపై పిల్లలకు అవగాహన కల్పించాలి










హైదరాబాద్, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా వారికి అవసరమైన భద్రత, సంరక్షణ కల్పించేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థ (TGSLSA) చేపట్టే కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం న్యాయ సేవల సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరవేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.

జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (NALSA) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణాది ప్రాంతీయ సదస్సును ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం: ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, NALSA ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన

మిగతా 2లో..

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికలో

## సంచలన విషయాలు

- 9,102 అట్రాసిటీ కేసులు, 213 హత్యలు




మిగతా 2లో..

## హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా

- తుంగతుర్తి నియోజకవర్గానికి మారను
- మారుతున్నాననే వదంతులు నమ్మొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్, అక్టోబర్ 03 : తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన

మిగతా 2లో..

### రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో

## అధ్వాన్నంగా ప్రభుత్వ హాస్పిటళ్లు

- రిమ్స్ ఘటన మరవకముందే.. భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్ ఎస్ఎన్ సీయూ లో సీలింగ్ కూలింది
- సర్కార్ దవాఖానకు వెళ్తే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేని దుస్థితి
- ఆపరేషన్ బ్లూ కోడ్ పేరుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులను ప్రజల ముందుంచుతాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ అక్టోబర్03:( విజన్ ఆంధ్ర) : రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లోని ఎస్ఎన్ సీయూలో సీలింగ్ కూలిన ఘటనపై "ఎక్స్" వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు

మిగతా 2లో..



## ముున్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

- అంతా బాగుందనుకుంటే ప్రమాదమే
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



న్యూఢిల్లీ, అక్టోబర్ 03 : ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు

మిగతా 2లో..

## క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతా

- ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- అంతటా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు
- అమరావతి క్వాంటం వ్యాలీపై ప్రపంచవ్యాప్త చర్చ
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026 నిర్వహణ
- సమ్మిట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన సిఎం
- డీప్‌టెక్ స్టార్టప్‌లకై రూ.500 కోట్ల వెంచర్ ఫండ్
- శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం



అమరావతి, అక్టోబర్ 03 : ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం

మిగతా 2లో..

## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

- ఈవీఎంల పార్తిగా దుర్వినియోగం జరిగింది
- లోక్‌సభ, అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి
- మోదీ, అమిత్ షా అక్రమంగా పదవుల్లో ఉన్నారు
- కేంద్ర ప్రభుత్వంపై మల్లికార్జున ఖర్గే ఆరోపణలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 03 : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు

మిగతా 2లో..

### 250 రూపాయల జీతం నుండి దేశవ్యాప్త

## టోల్ సామ్రాజ్యానికి - కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్ అసాధారణ ప్రస్థానం!

- ఎంజీబీఎస్ బస్టాండ్ లో రోడ్డపై పడుకున్న కుర్రాడు... నేడు తాజ్ కృష్ణలో కొడుకుల పుట్టినరోజు చేసిన ఘనుడు
- ఆమనగల్ నుండి ఢిల్లీ వరకు నాగర్ కర్నూల్ బిడ్డ స్ఫూర్తిదాయక గాథ



తెలంగాణ స్టేట్ బ్యూరో / వెల్దండ, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్. అతని జీవితం ఒక సినిమా కథను తలపిస్తుంది. 1982లో సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ గౌడ్ చిన్నతనం అంతా కష్టాలమయం.

పెద్దాపూర్ నుండి ఎంజీబీఎస్ వరకు: పెద్దాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి వరకు, ఆమనగల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతులు చదివాడు. పదవ తరగతిలో ఫెయిల్ కావడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో ఉన్న ఊర్లో ఉండలేక హైదరాబాద్ కు చేరుకున్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేదు. వారం రోజుల పాటు ఎంజీబీఎస్ బస్టాండ్ లోనే

మిగతా 2లో..

## అభివృద్ధికి '3ఎస్' మంత్రం




- ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం
- చంద్రబాబు అనుభవానికి ఎమ్మెల్యేల తోడు..
- సిఎంకు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది
- ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు
- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్, ప్రముఖులు

అమరావతి, అక్టోబర్ 03 : ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ – 2026'లో

మిగతా 3లో..



## సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 03 : హైదరాబాద్ భవానీనగర్ పోలీస్ స్టేషన్లో కస్టడీ వేధింపులపై తగిన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న ఇచ్చిన ఆదేశా లను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ షానవాజ్ ఆలం హైకో ర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీదేవి విచా రణ

మిగతా 2లో..

# రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో అధ్వాన్నంగా ప్రభుత్వ హాస్పిటళ్లు

చిన్నారులు మృతి చెందిన ఘటన మరవక ముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సీలింగ్ కూలిందని.. ప్రజల ప్రాణాల పట్ల ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనతో అర్థం చేసుకోవచ్చన్నారు. సీలింగ్ కూలిన సమయంలో వార్డులో అదృష్టవశాత్తూ పిల్లలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. లేదంటే ఈ ప్రభుత్వం పట్టిలేనితనానికి మరికొంత మంది పసికందులు బలయ్యేవారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సర్కార్ దవాఖానాకు వెళ్లే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. "మాట్లాడితే ప్రజా పాలనంటూ గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి.. ఇదేనా మీ ప్రజా పాలన? మీ చేతగానితనం కారణంగానే సర్కార్ దవాఖానాలు ఇంత అధ్వాన్నంగా తయారయ్యాయి" అని ధ్వజమెత్తారు. హాస్పిటల్స్ లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, రోగులకు కనీస సౌకర్యాలు, మందులు లేని పరిస్థితి ఉందన్నారు. బెడ్లు లేక వీల్ చైర్ లో చికిత్స చేసే దౌర్భాగ్య స్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. చేతగానీ కాంగ్రెస్ పాలన కారణంగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఎంత దయనీయంగా ఉన్నాయో త్వరలోనే బయటపెడతామని చెప్పారు. ఆపరేషన్ బ్లూ కోడ్ చూజూవతీఖ్అశీఅదీశ్రీబవజశీఎవ పేరుతో తెలంగాణ రక్షణ సేన నాయకులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తారని..ప్రభుత్వ వైఫల్యం కారణంగా అక్కడ ఎలాంటి దయనీయ పరిస్థితులు ఉన్నాయో ప్రజల ముందుంచుతామని చెప్పారు.

***ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలి***

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా పడి ముగ్గురు మృతి చెందిన ఘటనపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని కోరారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా

రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికలో సంచలన విషయాలు

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దాడులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక వెల్లడించింది.

***నివేదికలోని కీలక అంశాలు:***

2023 నుంచి 2026 జూలై వరకు రాష్ట్ర వ్యాప్తంగా 9,102 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులులి నమోదయ్యాయి. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 213 మంది హత్యకు గురయ్యారు. అందులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 159 మంది, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 54 మంది హత్యకు గురైనట్లు కమిషన్ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ మహిళలు, బాలికలపై 1,305 లైంగిక దాడి కేసులు నమోదయ్యాయి. అందులో ఎస్టీ మహిళలు, బాలికలపై 314 కేసులు ఉన్నాయి.

***శిక్షలు పడింది కేవలం 32 మందికే:***

9,102 అట్రాసిటీ కేసుల్లో కేవలం 32 మందికే శిక్షలు పడటం ఆందోళన కలిగిస్తోంది. కేసుల దర్యాప్తు, ఆధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలుపై పోలీసుల తీరుపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొంది. 2023 నుంచి 2026 జూలై వరకు కమిషన్ 5,867 ఫిర్యాదులు స్వీకరించింది. కుల వివక్ష, భూమి సమస్యలు, పోలీసుల దాడులు, కులాంతర వివాహాల అంశాలపైనా నివేదికలో ప్రస్తావించింది. కొన్ని ప్రాంతాల్లో దేవాలయ ప్రవేశాలపై వివక్ష, వినాయక ఉత్సవాల్లోనూ కుల వివక్షపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపింది. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలపై దాడులు, హత్యలపై కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇంత పెద్ద సంఖ్యలో కేసులు నమోదైనా కేవలం 32 మందికే శిక్షలు ఎందుకు పడ్డాయి? ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుపై ప్రభుత్వ పర్యవేక్షణ ఎంతవరకు ఉంది? అనే ప్రశ్నలను కమిషన్ లేవనెత్తింది.

# ముమ్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు

చేపట్టారు.పిటిషనర్ తరపు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి క్రిమి నల్ కేసులు లేకపోయినా పిటిషనర్ను ఆగస్టు 6న పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారన్నారు. దీనిపై కమిషనర్ తో సహా అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన కోర్టు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఒకవేళ ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న కమిషనర్ ను ఆదేశించినా చర్యలు తీసుకో లేదన్నారు. అందువల్ల కమిషనర్పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసు కోవాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రతివాది అయిన పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనారు నోటీసులు జారీ చేస్తూ విచారణను నవంబరు 6కు వాయిదా వేశారు.

## పిల్లల సైబర్ భద్రతకు ప్రభుత్వం పూర్తి మద్దతు

న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, మాజీ న్యాయమూర్తులు కూడా హాజరయ్యారు.

***మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక వ్యవస్థలు***

మహిళలు, పిల్లల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. ఇందుకోసం పోలీసు వ్యవస్థతో పాటు భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవల సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు.

పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో SHE-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని, CybHER యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, వారి తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పిల్లలకు సమర్థవంతమైన రక్షణ కల్పించాలంటే ప్రభుత్వంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

***3,000 మందికి పైగా అధికారులకు శిక్షణ***

బాధితులైన పిల్లలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ (TGSLSA), పాఠశాల విద్యాశాఖ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు వారి చట్టపరమైన హక్కులపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

పిల్లలు సైబర్ నేరాల వలలో చిక్కుకోకుండా తల్లిదండ్రులను కూడా ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సీఎం సూచించారు. పిల్లలు ఆన్‌లైన్ వేధింపులకు గురైనప్పుడు వారిని తప్పుబట్టకుండా, వారి సమస్యలను అర్థం చేసుకుని అండగా నిలవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు స్నేహపూర్వకంగా మార్గనిర్దేశం చేయడం ద్వారా వారిలో భద్రతపై నమ్మకాన్ని పెంపొందించవచ్చని తెలిపారు.

***హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన అవసరం***

సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను, పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, న్యాయ సేవల సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. "న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం మాత్రమే కాదు. బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, వారి గౌరవాన్ని పునరుద్ధరించడం కూడా. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం" అని సీఎం పేర్కొన్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల రక్షణకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చీూూూూ ఆధ్వర్యంలోని దక్షిణాది ప్రాంతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం, సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. పిల్లల సైబర్ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సదస్సు నిర్వహించిన చీూూూూ, జస్టిస్ విక్రమ్ నాథ్, తెలంగాణ హైకోర్టు, TGSLSAకు ధన్యవాదాలు తెలిపారు.

***సంచార లోక్ అదాలత్ వాహనాలు ప్రారంభం***

ఈ సందర్భంగా ఉచిత న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ (మొబైల్ లోక్ అదాలత్) వాహనాలను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. న్యాయ సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులోకి రావడానికి ఈ వాహనాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

## క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతా

పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు. ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 250 రూపాయల జీతం నుండి దేశవ్యాప్త టోల్ సామ్రాజ్యానికి - కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్ అసాధారణ ప్రస్థానం!

రోడ్లపై పడుకున్నాడు. ఉద్యోగం కోసం ప్రతి పెట్రోల్ బంక్ తిరిగాడు. చివరకు ఒక బంకులో పని దొరికింది.

***రూ.250 నుండి రూ.25,000 వరకు:***

మొదటి జీతం కేవలం 250 రూపాయలు. అయినా పట్టు వదలలేదు. అదే బంకులో 9 ఏళ్లు పనిచేశాడు. అటెండర్ నుండి క్యాషియర్, మేనేజర్ స్థాయికి ఎదిగాడు. జీతం 25 వేలకు చేరింది. హోటల్లో కూడా పనిచేస్తూ డబ్బులు కూడబెట్టాడు. ఈ క్రమంలో తండ్రి హైదరాబాద్ వచ్చి వెతికితే, తాండాకు చెందిన ఒక ఆటో డ్రైవర్ శ్రీనివాస్ ను గుర్తించి తండ్రికి అప్పగించాడు. వారం రోజులు ఊరికి వెళ్లి మళ్లీ తండ్రి అంజయ్య గౌడ్ కు నెలకు 500 పంపిస్తానని మాట ఇచ్చి హైదరాబాద్ వచ్చాడు. ఆ మాట నిలబెట్టుకునేందుకు చంపాపేట్ లో 150 రూపాయల అద్దె గదిని 8 మందితో పంచుకున్నాడు. చంపాపేట్ నుండి కోఠి వరకు నడుచుకుంటూ వెళ్లేవాడు. నైట్ డ్యూటీలు చేసి రోజుకు అదనంగా 15 రూపాయలు సంపాదించి, తండ్రికి 500 పంపేవాడు.

***బైక్ నుండి రియల్ ఎస్టేట్, టోల్ గేట్ సామ్రాజ్యానికి:***

కష్టపడి ఒక బైక్ కొన్నాడు. చిన్న చిన్న ఇళ్లు, ప్లాట్లు చూపిస్తూ రియల్ ఎస్టేట్ లోకి అడుగుపెట్టాడు. అక్కడే అతని తలరాత మారింది. కడ్తాల్ వద్ద టోల్ గేట్ కాంట్రాక్టర్ గా మారాడు. అప్పటి ఎమ్మెల్సీ, నేటి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి దివంగత నాయిని నరసింహారెడ్డి సహకారంతో ఆ అవకాశం దక్కింది. అది మొదలు... వెనక్కి తిరిగి చూడలేదు. నేడు భారతదేశ వ్యాప్తంగా అనేక టోల్ గేట్లకు కాంట్రాక్టర్ గా ఎదిగి సంచలనంగా మారాడు.

***బంధువులే ఆశ్చర్యపోయేలా:***

ఒకప్పుడు ఆర్థిక పరిస్థితి బాగోలేదని చులకనగా చూసిన బంధువులు, మిత్రులే నేడు అతని ఎదుగుదల చూసి నోరెళ్లబెడుతున్నారు. తన కుమారుల పుట్టినరోజు వేడుకలను ఏకంగా తాజ్ కృష్ణ హోటల్ లో ఘనంగా నిర్వహించడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

***రాజకీయ, ఆధ్యాత్మిక వలయంలో:***

కాంట్రాక్టు పనుల రీత్యా నియోజకవర్గం నుండి దేశవ్యాప్తంగా అన్ని పార్టీల రాజకీయ నాయకులతో వ్యక్తిగత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. అంతేకాదు, భారతదేశంలో ఏ దేవాలయానికి వెళ్లినా వీఐపీ దర్శనాలు చేయించగల పరిచయాలు సంపాదించాడు. ముఖ్యంగా ఏడుకొండలవాడు వెంకటేశ్వర స్వామి దర్శనాన్ని ఎంతో మంది రాజకీయ నాయకులు, అధికారులకు వీఐపీ దర్శనంగా కల్పించడంలో శ్రీనివాస్ గౌడ్ ముందుంటారు. రోడ్డు మీద పడుకున్న శ్రీనివాస్ గౌడ్ దేశవ్యాప్త టోల్ సామ్రాజ్యానికి అధిపతి కావడం నిజంగా నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

# ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

హైదరాబాద్, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

***సిబ్బంది నియామకానికి చర్యలు***

ఆసుపత్రులకు అవసరమైన వైద్యులు, ఇతర సిబ్బంది సంఖ్యను ముందుగానే గుర్తించి నియామక ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే సమయానికి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాలను సకాలంలో కొనుగోలు చేసి, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

***పాఠశాలలు, హాస్టళ్లపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ***

విద్య, వైద్య రంగాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులను విధిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ప్రతి వారం వీటిపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండటంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని తెలిపారు.

***గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష***

డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సదస్సు నిర్వహణ, అతిథుల ఆహ్వానం, పెట్టుబడుల అంశాలకు సంబంధించి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. త్వరలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బతుకమ్మ సందడి షురూ..

తెలంగాణ పల్లెల నుంచి పట్నాల వరకు ప్రతి వాడవాడలా పూల సింగిడులు విరబూయనున్నాయి. ప్రకృతిని, జీవితాన్ని, స్త్రీత్వాన్ని గౌరవించే ఈ పండుగకు ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జీహెచ్ఎంసీ, సంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి.

ఈ తొమ్మిది రోజుల వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజు అత్యంత ప్రధానమైనది. ఈ ఏడాది సద్దుల బతుకమ్మ వేడుకను అక్టోబర్ 18న హైదరాబాద్ గుండెకాయ అయిన ట్యాంక్‌బండ్ పై లక్షలాది మంది మహిళల సమక్షంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భారీ ప్రణాళిక రూపొందించింది. సద్దుల బతుకమ్మ రోజున అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు వేలాది మంది మహిళలు తమ చేతుల్లో రంగురంగుల బతుకమ్మలతో భారీ ర్యాలీగా తరలిరానున్నారు. ట్యాంక్‌బండ్ మొత్తం బతుకమ్మలతో నిండిపోయి, మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడే దృశ్యం కన్నుల పండుగగా ఉండనుంది. ఈ వేడుకను తిలకించేందుకు విదేశీ ప్రతినిధులు, పర్యాటకులను కూడా ఆహ్వానించనున్నారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. నెక్లెస్ రోడ్డు, బతుకమ్మ ఘాట్, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ప్రత్యేక లైటింగ్, సౌండ్ సిస్టం, మహిళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం సాఫీగా సాగేలా ప్రత్యేక క్రేన్లు, బోట్లు సిద్ధం చేస్తున్నారు.

కేవలం ట్యాంక్‌బండ్ మాత్రమే కాకుండా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పది రోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో తెలంగాణ జానపద కళాకారులచే బతుకమ్మ పాటలు, కోలాటాలు, బొడ్డెమ్మ, ఒగ్గుడోలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. రాష్ట్రంలోని వరంగల్, యాదగిరిగుట్ట, బాసర, వేములవాడ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కూడా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఈసారి బతుకమ్మ వేడుకలకు మరింత ప్రత్యేకత తీసుకురావడానికి ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేస్తోంది. త్వరలో జరగనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' థీమ్‌ను బతుకమ్మ లోగోలో అంతర్భాగంగా పొందుపరచనున్నారు. దీని ద్వారా తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటాలని ప్రభుత్వం భావిస్తోంది. బతుకమ్మ చీరల పంపిణీ కూడా త్వరలో ప్రారంభం కానుంది.

తొమ్మిది రోజుల పాటు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మలతో సాగి చివరగా సద్దుల బతుకమ్మతో ఈ పూల జాతర ముగుస్తుంది. ఈ తొమ్మిది రోజులు తెలంగాణ మొత్తం పూల పరిమళంతో, ఆడపడుచుల సంతోషంతో నిండిపోనుంది.

## ఈఎంఐల భయంతో

# బతుకు భారం

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 03 (విజన్ ఆంధ్ర): నెల జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఉద్యోగి కావచ్చు, వ్యాపారం చేసుకునే చిన్న వ్యాపారి కావచ్చు... బ్యాంకు రుణం తీసుకోవడం నేడు సాధారణమైపోయింది. కానీ ఆ రుణం తీసుకున్న తర్వాత వచ్చే ఈఎంఐల వేధింపులు మాత్రం సామాన్యుల ప్రశాంతతను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో ఒకటి రెండు ఈఎంఐలు ఆలస్యమైతే చాలు, ఫైనాన్సర్లు, రికవరీ ఏజెంట్లు చేస్తున్న అరాచకాలకు బాధితులు మానసికంగా కుంగిపోతున్నారు.

***ఫోన్లతో నరకం:***

వివిధ బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుండి రుణాలు తీసుకున్న బాధితులు చెబుతున్న దాని ప్రకారం, ఒక్క ఈఎంఐ పెండింగ్ లో ఉంటే చాలు రోజుకు కనీసం 10 నుండి 15 సార్లు ఫోన్లు చేస్తున్నారు. ఆఫీసులో ఉన్నా, ఇంట్లో ఉన్నా, మీటింగ్ లో ఉన్నా వదలడం లేదు. అసభ్య పదజాలంతో మాట్లాడటం, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అవమానించడం, వాట్సాప్ లో బెదిరింపు మెసేజ్ లు పంపడం నిత్యకృత్యంగా మారింది.

ఇంతటితో ఆగకుండా నేరుగా ఇంటికే వచ్చి తలుపు కొట్టి, చుట్టుపక్కల వాళ్ళ ముందు గట్టిగా అరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేకనే కదా ఈఎంఐ కట్టలేకపోతున్నామని, కొంచెం సమయం ఇస్తే కడతామని చెప్పినా వినే పరిస్థితి లేదని వాపోతున్నారు.




***ఉదయం నిద్ర లేవకముందే ఇన్సూరెన్స్ కాల్స్:***

ఈఎంఐ వేధింపులు ఒక ఎత్తైతే, లైఫ్ ఇన్సూరెన్స్, క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్ ఆఫర్ల పేరుతో వచ్చే కాల్స్ మరో నరకం. ఉదయం 6 గంటలకే నిద్రలో ఉండగానే ఫోన్ చేసి "సార్ మంచి పాలసీ ఉంది, తీసుకోండి బాగుంటుంది" అంటూ వేధిస్తున్నారు. తెలియని నెంబర్ల నుండి వరుస కాల్స్ తో, అలసిపోయి ఇంటికి వచ్చే ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

***నిబంధనలు ఏమంటున్నాయి?***

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) నిబంధనల ప్రకారం రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకే ఫోన్ చేయాలి. అసభ్యంగా మాట్లాడకూడదు, బెదిరించకూడదు. కానీ క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. బ్యాంకులు తమ రికవరీని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నాయి.

బాధితులు ఏం చేయాలి?

నిపుణులు చెబుతున్న దాని ప్రకారం, ఇలాంటి వేధింపులు ఎదురైతే బ్యాంకు నోడల్ ఆఫీసర్ కు, బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్ కు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే పోలీసులకు కూడా ఫిర్యాదు చేసే హక్కు బాధితులకు ఉంది. కానీ చాలా మంది భయంతో ఫిర్యాదు చేయడం లేదు. రుణం ఇవ్వడం బ్యాంకు బాధ్యత అయితే, మానవత్వంతో వసూలు చేయడం కూడా వారి బాధ్యతే. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని వేధించి మానసిక ప్రశాంతత దెబ్బతీయడం సరికాదని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఆర్బీఐ కఠినంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని విజన్ ఆంధ్ర తరపున డిమాండ్ చేస్తున్నాం.



# సంపాదకీయం

## మిడ్-ఎయిర్ డ్రామా

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారు.ఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చుర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చుర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామివ్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చుర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బె?ంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో అభిమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితి కి మార్చారు.పైలెట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్ గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

# అభివృద్ధికి '3ఎస్' మంత్రం

ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు."ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ూ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ౹ూ× ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు. కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు. "ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు. ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# 'తొలిముద్ద' తో చిన్నారులకు పౌష్టికాహారం

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ అక్టోబర్ 3:(విజన్ ఆంధ్ర) చిన్నారుల ఎదుగుదలకు తొలిదశ నుంచే పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకం 'తొలిముద్ద' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అల్పాహార ('తొలిముద్ద' )కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు అల్పాహారాన్ని మంత్రి జూపల్లి స్వయంగా తినిపించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. అక్టోబరు 1 నుంచి నాగర్‌కర్నూల్‌తో పాటు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తొలిదశలో 'తొలిముద్ద' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.పౌష్టికాహారంతో పాటు ప్రీ-స్కూల్ విద్య అందించడం ద్వారా చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంఅంగన్‌వాడీ కేంద్రాల్లో 'తొలిముద్ద' కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను



సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట మున్సిపల్ చైర్పర్సన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు అంగన్వాడి సిబ్బంది కొల్లాపూర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03:(విజన్ ఆంధ్ర) కోమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 26న జోడేఘాట్‌లో ఘనంగా నిర్వహించేందుకు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు.శనివారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 26న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేయాలని తెలిపారు.అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు సులభంగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా రహదారుల నిర్వహణ, సూచిక బోర్డులు, స్వాగత ఏర్పాట్లు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.కొమురం భీం జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, ఆదివాసీల హక్కుల కోసం చేసిన ఉద్యమాన్ని ప్రతిబింబించేలా వర్ధంతి కార్యక్రమ నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ సూచించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు.

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు

న్యూఢిల్లీ, అక్టోబర్ 03 : రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది.ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హుడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు. గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. స్వర్ణాల సంఖ్య కూడా 28 నుంచి 21కి పడిపోయింది. ముఖ్యంగా షూటింగ్‌లో ఏడు స్వర్ణాల నుంచి మూడింటికి తగ్గాయి. అథ్లెటిక్స్‌లో గతంలో ఆరు స్వర్ణాలు సాధించగా.. ఈసారి ఒక్క పసిడి మాత్రమే దక్కింది. రోయింగ్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలు తగ్గాయి. టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో ఈసారి ఒక్క పతకం కూడా రాలేదు. పతకాల సంఖ్య తగ్గినా.. ఈసారి పలువురు భారత క్రీడాకారులు వ్యక్తిగతంగా చరిత్ర సృష్టించారు. మహిళల హాకీ జట్టు నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణాన్ని అందుకుంది. ఆర్చరీ, గోల్ఫ్, షూటింగ్, రెజ్లింగ్‌లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. మొత్తంగా 20 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన భారత్.. చివరి వరకు పోరాడి టాప్-5లో నిలిచింది. కొన్ని విభాగాల్లో వెనుకబడినా.. మరికొన్ని క్రీడల్లో సాధించిన అపూర్వ విజయాలు ఈ ఆసియా క్రీడలను భారత క్రీడాభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేశాయి. కాగా.. ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు. ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది.

# హనుమంతుడే కాపాడాడు

హైదరాబాద్, అక్టోబరు 3దుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి, గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ ను ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మచ్చుర్ తో మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాక్ పిట్ లో తనకు ఎదురైన పరిస్థితిని మచ్చుర్ ప్రధాని మోదీకి వివరించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చూపించిన సమయ స్ఫూర్తి, ధైర్యం అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. త్వరగా కోలుకోవాలని యావత్ భారత్ ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు. ఇతరులను రక్షించడం కోసం తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటుంది" అని స్మిత్ తో మోదీ అన్నారు.మరో వైపు ప్రధాని మోదీయే నేరుగా ఫోన్ చేయడంపై కెప్టెన్ స్మిత్ మచ్చుర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మచ్చుర్ మాట్లాడుతూ "మీరు నాకు అత్యంత ఆరాధనీయులు. మీ నుంచి ఫోన్ రావడం గర్వంగా వుంది. కలలో కూడా నేను ఊహించలేదు. అనుకోని పరిస్థితులు, విపత్కర పరిస్థితుల్లో హనుమాన్ చాలీసా పఠిస్తా. కాక్ పిట్ లో ఘర్షణ సమయంలోనూ హనుమాన్ చాలీసాయే పఠించా. ఆ సమయంలో నేను గాయపడినా, ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలూ పోవద్దని మాత్రం దేవుడ్ని ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని గట్టిగా భావించా" అంటూ మోదీకి వివరించారు.

# శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్మెర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
ఆదివారం 4-10-2026


## శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా దుర్గాదేవి మండపం కర్ర పూజా

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఉత్సవాలకు శ్రీకారం



బోడుప్పల్,అక్టోబర్ 03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి మండపం కర్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి,అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను భక్తి,శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కల చంద్రయ్య,మరాటి మత్స్యగిరి, దయ్యల అలివేలు శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కుక్కల రాజు,కుక్కల స్వామి,బిక్షపతి,సాయి కిరణ్,వినోద్,కిరణ్,రాజు యాదవ్,బాలు,చంద్,మరాటి యశ్వంత్,లక్కీ,నాని,మణి,శశి,సాయి కుమార్,నవీన్,సాయిచరణ్,ఓంకార్,మహేష్,ఉపేందర్,కొమురయ్య, రమేష్,మరాటి సాయితేజ,భరత్,కుక్కల రాజమ్మ, అలివేలు,పద్మ,సమ్మక్క,మాధవి,కళ్యాణి,రాణి,శిరిష,లక్ష్మి,మహిళలు,యూత్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక యువత,భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల ఆహ్వాన పత్రిక జిల్లా కలెక్టర్ కు అందజేత



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)భద్రకాళి దేవాలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి దేవాలయ ఆలయ కార్య నిర్వహణ అధికారి సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆహ్వాన పత్రికను శనివారం కలెక్టరేట్ లో అందజేశారు. భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కు ఆలయ ఈవో, ప్రధానార్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తప్పకుండ విచ్చేయాలని వారు కోరారు.

## సెల్ఫ్ అడిట్ రిపోర్ట్ లు అందజేస్తాం రెండు నెలల గడువివ్వండి

### ట్రస్మా అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి



మేడ్చల్ జిల్లా,అక్టోబర్ 03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బడ్జెట్ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం స్వయంగా తయారు చేసుకున్న వార్షిక ఆర్థిక ఆడిట్ రిపోర్ట్‌లను సమర్పించేందుకు అనుమతినివ్వాలని తెలంగాణ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల సంఘం ( ట్రస్మా ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. బడ్జెట్ పాఠశాలలు ఇప్పటికే ఆర్థికంగా చితికి ఉన్నాయని చార్టెడ్ అకౌంట్ ట్లతో ఆడిట్ రిపోర్ట్ లు చేయించడం మరింత ఆర్థిక భారం అవుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ సూచనల మేరకు తమ పాఠశాలల ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక భారాన్ని మోయలేని పరిస్థితిలో తాము సెల్ఫ్ ఆడిట్ రిపోర్ట్ ను సబ్మిట్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందుకు మరో రెండు నెలల గడువును ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల పై ఫిర్యాదులను కోరుతూ ఆన్లైన్ పోర్టల్ ను తీసుకురావడం కూడా అభ్యంతరకరమన్నారు. పాఠశాలలతో సంబంధం లేని వ్యక్తులు కూడా తప్పుడు ఫిర్యాదులు చేసే అవకాశం ఉందని వాపోయారు. ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నటువంటి అంశాలపై సమగ్రంగా మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

హైదరాబాద్మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బాధ్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు.

# బీజేపీ ఏజెంట్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి

### 5న హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

### ఇండియా కూటమి పార్టీల ఉమ్మడి పిలుపు



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : బీజేపీ ఏజెంట్, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ హరిత హోటల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇండియా కూటమి నాయకులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి,జి.ప్రభాకర్ రెడ్డి,న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, తెలంగాణ జన సమితి నాయకులు చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్నిఅపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ అడ్డ దారిలో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకున్నదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదటి నుండి చేస్తున్న ఆందోళన నిజమైందని అన్నారు. మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బిజెపిలో చేర్చుకున్నారని, నేడు ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమంగా ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎన్నికలలో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదని అన్నారు. ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఓట్ చోరీపై ఆందోళనకు పిలుపునిచ్చిందని, ఈ నెల 5న హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ నుండి ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి అనిల్ ప్రియాంక, నాయకులు మార్క విజయ్ కుమార్, బంక సరళ, సంపత్, పింగళి వెంకట్రామ్ రెడ్డి, జక్కుల రవీందర్, బోడ డిన్న, సిపిఐ నాయకులు ఆదరి శ్రీనివాస్ తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్,ఎన్ఏ స్టాలిన్, మునిగాల బిక్షపతి, సిపిఎం నాయకులు బొట్ల చక్రపాణి, టి. ఉప్పలయ్య, వీరన్న, గౌడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వయో వృద్ధులు దిక్సూచి లాంటి వారు

### కన్నవారిని భారం గా భావించవద్దు బాధ్యత తో చూసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర)వయో వృద్ధులు దిక్సూచి లాంటివారనిహనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని... శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) సమన్వయంతో జిల్లా మహిళలు పిల్లలు దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వారం రోజులు నుండి జిల్లాలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్యం నుండి ఎదిగి కూతురు, కొడుకు, అమ్మ, నాన్న, అమ్మమ్మ, నాన్నమ్మ తాతయ్య ఇలా ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తూ జీవితం అంతా కుటుంబం కోసం ధార పోసి... వృద్ధాప్యం లోకి వచ్చిన వారిని బాగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రిటైర్ అయిన వారు ఉద్యోగానికి మాత్రమే రిటైర్ అయ్యారని, జీవిత అనుభవాలను ఇతరులకు పంచడంలో రిటైర్ కాలేదని, అలాగే ప్రభుత్వ పరంగా అందే ప్రతి సంక్షేమ పథకం వయో వృద్ధులకు అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు వయో వృద్ధులపట్ల నిర్లక్షంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. రాష్ట్రస్థాయిలో ఇటీవల పురస్కారం పొందిన సీనియర్ సిటిజన్ ఫోరం కమిటీ సభ్యులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. నాగులాంబ నర్సయ్య తో "జననీ శిశకామిని" అనే భక్తి పాటను పాడగా ఆసాంతం విని నర్సయ్య నాగమ్మ దంపతులను కలెక్టర్ అభినందించారు. జిల్లా పరిషత్ సీఈవో, లోకల్ బాడీస్ ఇంచార్జి అదనపు కలెక్టర్ బి శేషాద్రి మాట్లాడుతూ... అన్ని బంధాలను ఆదర్శంగా నిలబెట్టిన వృద్ధులు, అనుభవాల సారంగల వ్యక్తులు వయో వృద్ధులని అన్నారు. డీఆర్డీవో మేన శ్రీను మాట్లాడుతూ...జిల్లాలో 281 వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేసి 2870 సభ్యులను చేయించామని, సమావేశాల నిర్వహణ, పొదుపులు, అంతర్గత అప్పులు ఇస్తూ ప్రభుత్వ పథకాలను అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ మాట్లాడుతూ... జిల్లాలో కలెక్టర్ గారి సహకారంతో మూడు వయో వృద్ధుల డే కేర్ సెంటర్ లు ప్రారంభించామని...తద్వారా ఫిజియో థెరపీ,ఇతర ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా వయోవృద్ధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ అనిత రెడ్డి, అదనపు డీఆర్డీవో వెంకటేష్,జీడబ్ల్యూఎంసి అదనపు కమిషనర్ సమ్మయ్య, సెర్ప్ ప్రోగ్రాం మేనేజర్ కరుణాకర్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు దామెర నర్సయ్య, వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్.చంద్రమౌళి, మండల పరశురాములు, విడిపిపోలు స్వాతి, స్వరూప, సింధురాణి, అవంతి,సీనియర్ అసిస్టెంట్ వి వెంకట్ రామ్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, ఇంచార్జ్ డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# లింగాల కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

### ఉద్యమకారులను గుర్తించి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేత వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలిచిన లింగాల కేదారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని అన్నారు. కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని, తన వంతుగా కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్‌దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే చోటఅందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ మోతీ నగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను నిర్వాహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు, హస్తకళాకారులు తయారు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలను పురస్కరించుకుని మంగళగిరి ,ఉప్పాడ, వెంకటగిరి ,భాగల్ పూర్ శారీస్ తో పాటు డిజైనర్ వేర్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వచ్చే నెల ఒకటో తేదీ వరకు కొనసాగుతుంది . దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన బ్రాండెడ్ వస్త్ర ఉత్పత్తులు వీవర్స్ టు కస్టమర్ కు అందిస్తున్నట్లు నిర్వాహకులు మహ్మద్ సాబేర్ అలీ ,అక్బర్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం పది నుండి రాత్రి పది వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు

# 3తిరుమలకు రాపిడో, ఓలా, ఉబర్ బైక్‌లు నిషేధం!

### టీటీడీ కీలక నిర్ణయం

### అలిపిరి వద్ద 'నాట్ అలౌడ్' బోర్డులు

### యాప్‌లలో తిరుమల ఆప్షన్ తొలగింపునకు చర్యలు

తిరుమల:శ్రీవారి భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమల ఘాట్ రోడ్లలో రాపిడో, ఓలా, ఉబర్ వంటి బైక్ ట్యాక్సీ సర్వీసులను టీటీడీ పూర్తిగా నిషేధించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన సునీల్ అనే భక్తుడు శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయానికి వెళ్లేందుకు రాపిడో బైక్‌ను బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 26వ మలుపు వద్ద ద్విచక్రవాహనం క్రాష్ బారియర్‌ను బలంగా ఢీకొనడంతో బైకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, భక్తుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని టీటీడీ యాజమాన్యం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఘాట్ రోడ్డులో భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో వాణిజ్య బైక్ రైడ్లను తిరుమలకు అనుమతించకూడదని నిర్ణయించారు. ఈ మేరకు అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద 'నాట్ అలౌడ్' పేరిట పోస్టర్లను ప్రదర్శించారు. తిరుమల ఘాట్ రోడ్లలో కేవలం వ్యక్తిగత ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే బైక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ కొండపైకి రానివ్వబోమని అధికారులు స్పష్టం చేశారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా నిలవాలి

### ఉప్పల్, చెంగిచెర్ల బస్ డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్



బోడుప్పల్,అక్టోబర్ 03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ,టిఎంయూ,ఎన్ఎంయూ,జెఏసి కూటమికి మద్దతు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్ ఆర్టీసీ కార్మికులను కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఉప్పల్, చెంగిచెర్ల బస్ డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన ఆర్టీసీ కార్మికులను కలిసి కూటమికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలు కావడంతో ప్రతి కార్మికుడు తమ సమస్యలు, హక్కులపై ఆలోచించి ఓటు వేయాలని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యతే బలం. హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాలని వి.ఎస్. బోస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, మండల కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, బాపరాజు, ఐలయ్య, జి. నాగరాజు, ఇస్తారి, సోమరాజు, ఆర్టీసీ కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వికాస తరంగిణి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ పట్టణానికి చెందిన వికాస తరంగిణి మానుకోట జిల్లా కోశాధికారి, వాసవి క్లబ్ జూ.వైస్ పర్సన్ వాసవి సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ్ర వెంకటేశ్వర్లు సేవా భావంతో శనిగపురం పరిసర ప్రాంతంలో గల ఆదర్శ వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆశ్రమంలో ప్రతి ఒక వృద్ధులకు టవల్స్ , పండ్లు, బిస్కెట్లు వితరణ చేశారు . వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృద్ధులను కలిసి వృద్ధులకు ఉడుతా భక్తిగా తమ వంతు కర్తవ్యం గా వృద్ధులతో సమయము గడుపుట పూర్వజన్మ సుకృతమని తమ యొక్క అదృష్టంగా భావిస్తున్నానని కొనియాడారు ఈ కార్యక్రమంలో, డాక్టర్ డీ ప్రవీణ్ నాయక్ వృద్ధులందరికీ హెల్త్ చెకప్ చేసి వారికి అవసరమున్న ఆరోగ్య సూచనలు తెలిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమములో వృద్ధాశ్రమ ధనుంజయ్ ప్రేమ్ వ్యాస్ జంగాల వెంకట్, బొడ్డ కామేశ్వరరావు, దాబా శ్రీను పాల్గొన్నారు

## ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్ 2026-27 (ఫేజ్-1) ప్రారంభోత్సవం



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ (కిట్స్) వరంగల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కె యు ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్ 2026-27 (ఫేజ్-1) నిర్వహించ బడుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలు 2026 అక్టోబర్ 5, 6 మరియు 7తేదీలలో 3 రోజుల పాటు కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని క్రీడా మైదానాల్లో నిర్వహిస్తోంది అని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా, అలాగే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ టి. శాస్త్రి గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. ఇందులో భాగంగా మొత్తం ఆరు రకాల గేమ్స్ లు వరుసగా షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ టేబుల్ టెన్నిస్ మరియు వ్యాలీ బాల్ నిర్వహించ బడును అని తెలిపారు. మాజీ. రాజ్యసభ ఎంపి & కిట్స్‌డబ్ల్యు చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు, ఈ కార్యక్రమాన్ని కిట్స్‌డబ్ల్యు కోశాధికారి పి.నారాయణరెడ్డి గ్రీన్ చేస్తారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్, పి రమేష్ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ యం. శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పీఆర్ఓ డాక్టర్ డి ప్రభాకరా చారి, అలాగే ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు: వెంకటస్వామి, నాగరాజు, మహేష్, మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరుకానున్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
ఆదివారం 4-10-2026


# మానసిక, శారీరక దృఢత్వాన్ని క్రీడల వల్ల సాధించవచ్చు - ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ఏ ఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

### ఆటల నందు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండి పాల్గొనాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
### అట్టహాసంగా వార్షిక జిల్లా పోలీసు క్రీడలు ప్రారంభం
### వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన జిల్లా జిల్లా ఎస్పీ, అధికారులు.

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)అనునిత్యం పోలీసు విధులలో నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా స్థాయి పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడం జరుగుతుంది. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం నందు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఏ ఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులతో కలిసి పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. మొదటగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. తదుపరి పరేడ్ మైదానం నందు రిజర్వ్ ఇన్స్పెక్టర్ వెంకటి ఆధ్వర్యంలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాలోని 6 బృందాలుగా ఉన్నటువంటి విక్టర్స్, టైటాన్స్, వారియర్స్, టైగర్స్, గ్లాడియేటర్స్, రాయల్స్ లుగా ఉంటూ చక్కటి పరేడ్ ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేయడం జరిగింది. తదుపరి స్పోర్ట్స్ జెండాను అధికారుల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు తెలియజేస్తున్నటువంటి ముఖ్య అతిథులు అందరితో కలిసి శాంతి కపోతాలను, బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించారు. అదేవిధంగా క్రీడాజ్యోతిని క్రీడాకారులైనటువంటి వారు పరేడ్ మైదానం చుట్టూ తిరిగి ముఖ్య అతిథులకు అందజేయగా వారు క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం అదనపు ఎస్పి పి మౌనిక క్రీడాకారులచే ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా క్రీడలను ఆడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ మొదటగా క్రీడా పోటీలలో



పాల్గొననున్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీల లోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలియజేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. ప్రతిరోజు నిర్వహించే పోలీసు విధులు అయినటువంటి బందోబస్తులు, క్రైమ్ డిటెక్షన్లు, ఉద్యోగం, లాంటి విధులకు ఆటవిడుపుగా ఇలాంటి పోలీసు క్రీడా పోటీలు నిర్వహిస్తారని వాటిలో ప్రతి ఒక్కరూ పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందవలసిందిగా తెలిపారు. ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పనిచేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పోటీల్లో పాల్గొని సిబ్బంది తమ తీయటి గుర్తులను వచ్చే సంవత్సరం వరకు గుర్తుచేసుకోవచ్చు అని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసులు అనునిత్యం వివిధ రకాలైనటువంటి విధులలో నిమగ్నమై ఉంటారని వాటిని మరచిపోతూ ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందోత్సవాల మధ్య ఈ వార్షిక క్రీడల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొనవలసిందిగా తెలిపారు. పోలీసుల ప్రతి రోజు శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాలు నియంత్రణ మరియు పరిశోధన, బందోబస్తులు ఇలాంటి విధులలో నిమగ్నమై ఉంటారని వారందరూ ఎలాంటి క్రీడలలో పాల్గొనడం వల్ల మంచి క్రీడా స్ఫూర్తి పెరగడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పోలీసులకు మంచి పేరు కీర్తి ప్రతిష్టలు రావడానికి ప్రతి ఒక్కరు చేసిన కృషిని అభినందిస్తూ ప్రతి ఒక్క పోలీసు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. తదుపరి 800 మీటర్స్, 400 మీటర్స్ పరుగు క్రీడలను అధికారులు అందరితో కలిసి ప్రారంభించారు, గెలిచిన సిబ్బందికి మెడల్స్ ను అందజేసి అభినందించారు. వాలీబాల్ క్రికెట్ క్రీడలను జిల్లా ఎస్పీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్సాహపరిచారు. ముఖ్యంగా ఈ క్రీడలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు అందులో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాట్మెంటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ లాంటి వివిధ అంశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

??800 మీటర్స్ పురుషుల పరుగు విజేతలు.

1. జె రమేష్,
2. ఎం నగేష్.
3. జె సతీష్,

?? 400 మీటర్స్ మహిళల పరుగు విజేతలు.

1. పి పూజ,
2. టి మల్లేశ్వరి,
3. సిహెచ్ శిల్ప

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్, ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, పిఓ ఐటిడిఏ మంద మకరందు ఐఎఎస్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ కె ప్రణయ్ కుమార్ ఐఎఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ ఎఫ్డిఓ ప్రథమేష్ ఐఎఫ్ఎస్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష,మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, లైబ్రరీ చైర్మెన్ మల్లెపూల నర్సయ్య, పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్మిత్ మచ్చర్ సాహసం దేశకీర్తిని పెంచింది

### ఆపద్బాంధవా త్వరగా కోలుకో




నారాయణపేట, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో విమానంలో ఉగ్రవాదుల కుట్రలను సాహసంతో ఎదుర్కొని ప్రాణాలకు తెగించి170 ప్రాణాలను కాపాడినకెప్టెన్ స్మిత్ మచ్చర్ త్వరగా కోలుకోవాలని శనివారం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ విద్యార్థులు ఫ్లా కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరి ప్రాణాలను కాపాడడమే అంతిమ లక్ష్యంగా కృషిచేసిన స్మిత్ మచ్చర్ సాహసం భారతదేశ కీర్తిని పెంచిందని అన్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని, తిరిగి ప్రజా సేవలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మధుసూదన్ రావు భాను ప్రకాష్ మంగళ లక్ష్మణ్ ప్రతాప్ నరసింహ రఘురాం రెడ్డి నిర్మల శశిరేఖ వెంకటేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలి
### దిశ సమావేశంలో ఎంపీ డీకే అరుణ

నారాయణపేట, అక్టోబర్3 (విజన్ ఆంధ్ర) రైతులు, మహిళలు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్ డీకే అరుణ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ కమిటీ సమావేశానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో,కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను సాధించే విధంగా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పథకాల అమలును క్షేత్రస్థాయి వరకు పకడ్బందీగా తీసుకెళ్లడంతో పాటు నిర్ణీత గడువులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా తదుపరి అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు, అదనపు నిధులు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ప్రధానమంత్రి పీఎండీకేవై కార్యక్రమం కింద నారాయణపేట జిల్లాకు ప్రథమ స్థాయి అవార్డు లభించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగాన్ని ఎంపీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ఆకాంక్షించారు. నారాయణపేట ఆస్పిరేషనల్ జిల్లాగా కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల ప్రారంభ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని సమన్వయంతో కొనసాగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకట్ రాములు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన, కొనసాగుతున్న పనుల వివరాలను వివరించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన రహదారి పనులపై ఈఈ అశోక్ వివరాలు సమర్పించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ నర్వ మండలంలో సూచికల ఆధారంగా చేపట్టిన అభివృద్ధి



కార్యక్రమాలను సమన్వయకర్త బాలాజీ వివరించారు. నర్వ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల అవసరాన్ని ఎంపీ దృష్టికి తీసుకురాగా, దీనిపై అవసరమైన చర్యలు పరిశీలించాలని సూచించారు. భారత్‌మాల ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులపై ఎంపీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 ఎకరాల్లో 1,500 మంది రైతులు ఉండగా, సుమారు 150 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ తెలిపారు. రూ.217 కోట్ల నష్టపరిహారానికి గాను రూ.184 కోట్లు చెల్లించినట్లు వివరించారు. నష్టపరిహారం రేటు తక్కువగా ఉందన్న కారణంతో కొందరు రైతులు పరిహారం స్వీకరించలేదని తెలిపారు. సేకరించిన భూమికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం తప్పనిసరిగా చెల్లిస్తున్నట్లు జాతీయ రహదారుల శాఖ అధికారి వివరించారు. భూసేకరణలో ఉన్న సమస్యలను పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని, రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 151 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని విద్యుత్ శాఖ ఎస్ఈ నవీన్ తెలిపారు. వీటిలో 49 సర్వీసులు విడుదల కాగా, 162.32 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. సర్వీసులు పొందిన 49 మంది లబ్ధిదారులు సబ్సిడీకి అర్హత పొందినట్లు తెలిపారు. పీఎం-కుసుమ్ పథకం కింద 24 ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించగా, వాటిలో 3 ప్రాజెక్టులకు అనుమతులు లభించినట్లు వివరించారు. గిరిజన తండాల్లో అన్ని నివాసాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయా అనే అంశంపై ఎంపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించి మొత్తం 15 పనుల్లో 7 పనులు పూర్తయ్యాయని, 8 పనులు పురోగతిలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఫేజ్-1లోని 15 పనుల్లో 8 పనులు పూర్తయ్యాయని, ఒక పని ప్రారంభం కావాల్సి ఉందని, త్వరలోనే ఆ పనిని ప్రారంభిస్తామని వివరించారు. జిల్లాలో మైనింగ్ ద్వారా సమకూరుతున్న ఆదాయం, ఇసుక రవాణాకు ఇస్తున్న అనుమతులపై ఎంపీ వివరాలు కోరారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొంటూ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఉట్కూర్ మండలం వల్లంపల్లి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని పీఆర్ఈఈ అశోక్‌ను ఎంపీ ఆదేశించారు. నారాయణపేట--మక్తల్ రోడ్డు పనుల ప్రారంభంపై కమిటీ సభ్యులు అడగగా, పనులు ప్రారంభమయ్యే వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్యను ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జిల్లాలో నిర్మిస్తున్న, నిర్మించాల్సిన రహదారుల వివరాలను పీఆర్ఈఈ అశోక్ వివరించారు. జిల్లాలో అటవీ శాఖ పరిధిలోని నర్సరీలు, నాటిన మొక్కల వివరాలను అటవీ శాఖ అధికారి వివరించారు. తిరుమలపూర్ వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులపై పరిశీలించాలని ఎంపీ సూచించారు. నారాయణపేట మున్సిపాలిటీలో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆసుపత్రిలో 6,500 ఇన్‌పేషెంట్ కేసులు నమోదయ్యాయని, అక్టోబర్ నుంచి ఇప్పటివరకు సుమారు 4,000 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. సాంకేతిక, సాంకేతికేతర విభాగాల్లో 34 కేటగిరీలకు సంబంధించి 154 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని వివరించారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌లో భాగంగా జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వయోజన విద్య ఇన్‌చార్జి శ్రీనివాస్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్నాయని వివరించారు. 2025--26 సంవత్సరానికి రూ.4,02,632 నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మార్చి 29న నిర్వహించిన ఖీచీూ పరీక్షకు 18,062 మందిని నమోదు చేయగా, 8,172 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. సెప్టెంబర్ 27న నిర్వహించిన రెండో దశ పరీక్షకు 24,665 మందిని లక్ష్యంగా నిర్దేశించగా, 17,800 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో అక్షరాస్యత రేటు 49.93 శాతం, మహిళల అక్షరాస్యత రేటు 39.72 శాతంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ,,వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ,పంచాయతీ రాజ్,విద్యా శాఖ, డీ డబ్ల్యు ఓ, ఎస్సీ అభివృద్ధి, ఆర్ డబ్లు ఎస్, పౌర సరఫరాల శాఖ, నాబార్డు, మైనింగ్ శాఖ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, భూగర్భ జల వనరుల శాఖ, చీఫ్ ప్లానింగ్, ఉద్యాన శాఖ, ఇరిగేషన్, కార్మిక శాఖ, నేషనల్ హైవే,ఆర్‌డబి శాఖల ద్వారా చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులు క్లుప్తంగా వివరించారు.

## ఆదిలాబాద్ జిల్లా,లో ప్లాట్ పేరుతో మోసం.. నకిలీ పత్రాలతో బ్యాంకు ఋణం

### ఆదివాసి బాధితున్ని 67.20 లక్షల మోసం
### ముగ్గురిపై 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు, ప్రధాన నిందితుడు అరెస్టు, రిమాండ్.
### ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 3( విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో ప్లాట్ కొనుగోలు పేరుతో మోసం చేసి, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసి, బ్యాంకు రుణం పొందినట్లు ఫిర్యాదు రావడంతో ముగ్గురు వ్యక్తులపై ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. నిందితులు:1. గటిక లక్ష్మణ్ స్వామి, ం/శీ నర్సింలు, సంజయ్‌నగర్.

2. గటిక క్రాంతి కుమార్, ం/శీ గటిక లక్ష్మణ్ స్వామి.(అరెస్టు, రిమాండ్)
3. తోకల నరేష్, ప్రస్తుత కౌన్సిలర్. (పరారీ) నిందితులు ఎల్‌బీఎస్ నగర్‌లో ప్లాట్ ఉందని ఫిర్యాదుదారుడు మడావి గోపాల్ ను నమ్మించి, ప్లాట్ కొనుగోలు మరియు ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు రుణం ఇప్పిస్తామని చెప్పినట్లు తెలిపారు. అనంతరం ప్లాట్ నంబర్ 37, సర్వే నంబర్ 45కు సంబంధించిన స్థలాన్ని నకిలీ పత్రాల ద్వారా ఫిర్యాదుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రూ.53.50 లక్షల రుణం పొందించి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు, నిర్మాణ సమయంలో రుణం సరిపోదంటూ అదనంగా రూ.13.70 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు. 1987 సంవత్సరంలో రామేశ్వర్ అనే వ్యక్తి కొనుగోలు చేసి ఉండడంతో, అదే ప్లాట్ ని నిజాన్ని దాచిపెట్టి బాధితునికి విక్రయించి మోసానికి పాల్పడడం జరిగింది. ఇల్లు పూర్తి అయి గృహప్రవేశం చేసే సమయానికి నిజం యజమాని అధికారుల సమక్షంలో ఈ ఇంటిని జప్తు చేయడం జరిగింది. 2026 ఆగస్టులో మున్సిపల్ అధికారులు హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఇంటిని స్వాధీనం చేసుకోవడంతో అసలు విషయం తనకు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై నిందితులను ప్రశ్నించేందుకు ఫిర్యాదుదారుడి కుమారుడు, సోదరుడు తదితరులు వెళ్లగా, వారిని కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆదిలాబాద్ డిఎస్పీ తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు రుణం, నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

## అక్టోబర్ నెలకు సంబంధించిన యుడిఐడి (సదరం క్యాంపు)

### -జనరల్ హస్పటల్ సూపర్డెంట్ మురళి కృష్ణ

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :03(విజన్ ఆంధ్ర)2026 సంవత్సరం అక్టోబర్ నెలకు సంబంధించిన యుడిఐడి (సదరం క్యాంపు )ఈనెల7,8,9,14,15,16,23,28,29,30, తేదిలలో ఉదయం 10:00 గంటలకు యుడిఐడి (సదరం) శిబిరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంగారెడ్డి నందు నిర్వహించబడును అని హాస్పటల్ సూపర్డెంట్ మురళి కృష్ణ శుక్రవారం నాడు కొత్తకడంలో తెలిపారు . యుడిఐడి పోర్టల్ ద్వారా స్లాట్ రిజిస్టర్ చేసుకున్నవారికి ఫోన్ కాల్ ద్వారా కానీ మెసేజ్ ద్వారా కానీ మీకు సందేశం అందిన వారు మాత్రమే క్యాంప్ నకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంగారెడ్డి యందు హాజరు కాగలరని తెలిపారు. యుడిఐడి (సదరం క్యాంపునకు వచ్చేవారు స్లాట్ పేపర్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫోటో సంబంధిత మెడికల్ రిపోర్ట్ తప్పనిసరిగా తీసుకొని హాజరు కాగలరని తెలిపారు.

## వైజాపూర్ లో ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం అని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారంఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించిందనీ, నిపుణులైన వైద్యుల బృందం రోగులను క్షుణ్ణంగా పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిరుపేదలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని, ఆరోగ్య శిబిరాలను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. సమాజం పట్ల బాధ్యతతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడానికి ముందుకు వచ్చిన వైజాపూర్ మెడికల్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, డీఎంహెచ్ఓ సాధన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం.
### నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అక్టోబర్ 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు




గద్వాల అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, బీట్ బుక్స్, జనరల్ డైరీ, సీసీటీఎన్ఎస్ పనితీరును పరిశీలించారు. ఆన్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ల గస్తీ, బీట్‌ల నిర్వహణ వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు, ఇతర నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు.డయల్ 112కు సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్లు 24ఐ7 అప్రమత్తంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృతంగా డ్రంకథ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఈ తనిఖీలో గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై సిహెచ్. శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో విషాదంఅనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

.ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం.

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అక్టోబర్ 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన 300 మంది నిరుద్యోగులకు ఆఫర్ లెటర్లు అందజేసిన ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు



కాగజ్ నగర్ అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర) కాగజ్‌నగర్: పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ జాబ్ మేళాకు సుమారు 1500 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరయ్యారు. బీటెక్, పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాల కోసం మేళాలో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన 45 కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థుల అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలు, ఎంపిక ప్రక్రియ అనంతరం 300 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఎంపికైన వారికి సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు వారిని సాధికారత వైపు నడిపించాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళాను నిర్వహించినట్లు తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. భవిష్యత్‌లోనూ ప్రతి సంవత్సరం మెగా జాబ్ మేళాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన 45 కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, నిరుద్యోగ అభ్యర్థులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో జాబ్ మేళా నిర్వాహకులు చందర్, జిల్లా బీజేపీ అధ్యక్షులు ధోని శ్రీశైలం, కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, చిప్పకుర్తి శ్రీనివాస్, శివా గౌడ్, నాయకులు మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, ఎల్ములు మల్లయ్య, పుల్ల అశోక్, కుంచాల విజయ్, కుకిడే రాజేశ్వర్, మోతిరాం, సర్పంచులు చంకాపురే లావణ్య, రాచర్ల మహేష్, అగ్గిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బి కే ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా బలరాం జయంతి వేడుకలు



నారాయణపేట ,అక్టోబర్3 విజన్ ఆంధ్ర) భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో బలరాం జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.శాంతినగర్, బ్రహ్మన్ వాడి హనుమాన్ మందిరం లో బి కే ఎస్ నగర ఉపాధ్యక్షుడు టంగ విశ్వనాథ్ రెడ్డి భగవాన్ బలరాం జయంతి వేడుకలను నిర్వహించారు. బలరాముని చిత్రపటానికి పూజ నిర్వహించి భక్తిశ్రద్ధలతో రైతు దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బి కే ఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ,జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి మాట్లాడుతూ భగవాన్ బలరాముడు ఆదర్శంగా చేసుకొని రైతాంగం దినోత్సవం జరుపుకోవడం గొప్ప విషయం అన్నారు.భారతీయ కిసాన్ సాంగ్ ఏర్పాటు చేయడం,రైతాంగ సంఘటితంగా రాజకీయానికి అతీతంగా గ్రామ ఆర్థిక అభివృద్ధి విద్యుత్తు సమస్యలు మార్కెటింగ్ సమస్యలు వరి కొనుగోలు అవకతవకలు రెవెన్యూ సమస్యలపై రైతులు సంఘటితంగా పరిష్కరించడానికి మనమే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి నెలలో సమావేశమై రైతాంగ సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎల్ ని నో ప్రభావం వల్ల కరువు ప్రాంతం ప్రకటించి నష్టపరిహారం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలన్నారు. ఈ ప్రాంత ఆదర్శ రైతు డాక్టర్ కాకర్ల భీమయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరము బలరాముని పూజలో పాల్గొంటు అవకాశం వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తంగ విశ్వనాథ్ రెడ్డి, నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శాసమల బాలప్ప, గుండుల వెంకటప్ప, గుండూల బాలప్ప, నగర మాజీ ఉపాధ్యక్షుడు జంగిటి శీను, పోలేమని వెంకటేష్, పోలేమని భీమప్ప, జంగిటి నారాయణ, పటేల్ రఘు, శరణప్ప, కోగ్గి వెంకట్ రెడ్డి ,జంగిడి వెంకటేష్, కోనంగి వెంకటరెడ్డి, అంజన్న యాదవ్, పూజారి నారాయణ,మహిళా సంఘం సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

# కోయిల్‌కొండ తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతు మృతి ఘటనపై తహాశీల్దార్ వివరణ

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర)కోయిల్‌కొండ తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం చోటుచేసుకున్న రైతు పసుల లావప్ప (50) మృతి ఘటనపై కోయిల్‌కొండ తహాశీల్దార్ జి. దీపక్‌రావు వివరాలు వెల్లడించారు.కోయిల్‌కొండ మండలం పార్వల్లి గ్రామానికి చెందిన పసుల లావప్ప తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తహాశీల్దార్ తెలిపారు. ఉదయం సుమారు 6.30 గంటలకు ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిబంధనల ప్రకారం ప్రాథమిక విచారణ చేపట్టిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.భూ వివాదంపై కుమారుడి వాంగ్మూలంమృతుడి కుమారుడు పసుల కురుమూర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, పార్వల్లి శివారులోని సర్వే నంబర్ 211లోని వ్యవసాయ భూమికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు తహాశీల్దార్ తెలిపారు.దయ్యాలి లక్ష్మయ్య, పసుల చంద్రశేఖర్, పసుల విష్ణు, దయ్యాల రామకృష్ణ అనే వ్యక్తులు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించేందుకు ప్రయత్నించడం, పంటకు నష్టం కలిగించడం, తన తండ్రిపై దాడికి ప్రయత్నించడం, బెదిరింపులకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిపారు.అదేవిధంగా, మృతుడు రాసినట్లు పేర్కొంటున్న సూసైడ్ నోట్‌లో కొందరి పేర్లు ఉన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తహాశీల్దార్ తెలిపారు. ఆ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు పోలీసులను కోరినట్లు వివరించారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులుసర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు తహాశీల్దార్ తెలిపారు. 1954--55 ఖస్రా పహాణీ ప్రకారం సర్వే నంబర్ 211లో మొత్తం 18.39 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉండగా, టిప్పన్ ఆధారంగా నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో 17.39 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన భౌతిక స్వాధీన అంశంపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్నట్లు పేర్కొన్నారు.సంబంధిత సర్వే నంబర్ లో పేర్కొన్న భూమి కి మృతుడికి ఎటువంటి సంబంధం లేదని తహాశీల్దార్ వివరించారు.మృతుడి కుటుంబ వివరాలువిచారణలో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు పసుల లావప్ప పార్వల్లి గ్రామానికి చెందినవారని, ఆయనకు కనకమ్మ, మంజుల అనే ఇద్దరు భార్యలు మృతి చెందినట్లు తహాశీల్దార్ తెలిపారు. వేణుగోపాల్, కుర్మయ్య, గంగాధర్ అనే ముగ్గురు కుమారులు, నాగేశ్వరమ్మ అనే కుమార్తె ఉన్నట్లు పేర్కొన్నారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తహాశీల్దార్ దీపక్‌రావు తెలిపారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, పోస్టుమార్టం నివేదిక, రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

# చిన్న నిర్లక్ష్యం పెద్దమూల్యం

## ప్రధాన కుడళ్ళు, మలుపుల వద్ద లేని స్పీడ్ బ్రేకర్లు

## ఆర్ అండ్ బి అధికారుల అలసత్వం

## ఎస్పీ ఆఫీస్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి

## అండర్ బ్రిడ్జి ప్రమాదంలో మహిళ మృతి

## ప్రమాదకరంగా రైల్వే అండర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి చివరలు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (విజన్ ఆంధ్ర):మానుకోట పట్టంలో చిన్న నిర్లక్ష్యాలకు పెద్ద మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్ రోటరీక్లబ్ జనరల్ సెక్రెటరీ శంతన్ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండురోజుల క్రితం ఎస్పీ ఆఫీస్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని పన్నెండేండ్ల బాలుడు మృతి చెందడం బాధకరమన్నాడు. దీనికి కారణం ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేక పోవడమేనని అన్నారు. ముడుకొట్ల సెంటర్, ముత్యాలమ్మ సెంటర్, సర్వేపల్లి రాదాకృష్ణ సెంటర్ తో పాటు ఏరియా ఆసుపత్రి దగ్గర స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లి సెంటర్లో ఓయువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే అన్నాడు. ప్రమాదాలకు ఆస్కారం లేని నెహ్రూసెంటర్లో సైతం గతంలో ఒక రేషన్ డీలర్ మృతి చెందిన విషాద ఘటన పట్టణ ప్రజలు మరచిపోలేదన్నాడు.అండర్ బ్రిడ్జి ఎక్కువ ఏటవాలుగా లోతుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలపై డ్రైవర్లు నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమధ్యనే ఓమహిళ ప్రాణాలు కొల్పోయిందన్నారు. అదేవిదంగా పూలే జంక్షన్లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి వేగంగా వాహనాలు రావడంతో ప్రవమాదాలు జాతుగుతున్నాయన్నారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి రెండు చివరలను తలాతోక లేని విధంగా నిర్మించడంతో ప్రమాదాలు నిత్యకృత్యమాయ్యాన్నారు. కురవి రోడ్ వైపు అయితే పెద్ద వాహనాలు, బస్సులు బ్రిడ్జి ఎక్కాలన్నా దిగాలన్నా సర్కస్ ఫీట్లు చేస్తున్నాయని తెలిపారు. పట్టణంలో ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు మానుకోట యువ బైక్ రైడర్లను , పెద్ద వాహనదారులను నియంత్రించ లేక పోతున్నాయని వాపోయారు. పై మూడు ప్రమాదాల్లో స్పీడ్ బ్రేకర్లు లేక భారీ వాహనాలు వేగంతో ఢీ కొట్టిన సందర్భంలోనే ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసి పోయాయని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు.వీటికి తోడు పట్టణంలోని చాలా చోట్ల రోడ్డు మధ్యలో వాటర్ పైపుల వాల్స్ కోసం కోసం తీసిన గుంతలు ప్రమాదలను పెంచుతున్నాయన్నారు. ఉదాహరణకు కంకరబోడ్ సర్కిల్ వద్ద అవసరానికంటే ఎక్కువ వెడల్పు గుంత తియ్యడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వెళ్ళగాక్కారు. లక్ష జనాభాతో పాటు రోజూ ఇరవై వేల మంది ప్రజలు మానుకోటకు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇగ ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని ఆపే శక్తి స్పీడ్ బ్రేకర్లకే కాదు అధికారులకు కూడా లేక పోవడం వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతోందన్నాడు. సరకులు, సిమెంటు, ఐరన్, కంకర, మట్టి లోడ్ లతో వచ్చే వాహన చోదకులు క్షణకాలం ఏమరుపాటుగా వున్నా ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. సర్వేపల్లి, నెహ్రూ సెంటర్, రైల్వే అండర్ బ్రిడ్జిలో జరిగిన ప్రమాదాలు పెద్ద వాహనాలవే అనే విషయం మరువొద్దన్నారు. పట్టణంలో చాలా చోట్ల ఇదే సమస్య ఉందన్నారు.కాబట్టి సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

# రాసినా.. చెప్పినా.. స్పందన శూన్యం

## కొమురవెల్లి రహదారి దుస్థితిపై అధికారుల నిర్లక్ష్యం.. గుంతల్లోనే రాకపోకలు



రెబ్బెన అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర) రెబ్బెన మండలం: కొమురవెల్లి గ్రామంలోని ప్రధాన రహదారి దుస్థితిపై పలుమార్లు వార్తలు ప్రచురించినా, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి గుంతలమయమై వాహనదారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోందిరహదారి దుస్థితిపై గ్రామపంచాయతీ కార్యదర్శికి పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, అలాగే పంచాయతీరాజ్ శాఖ ఏఈ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా పరిష్కారం మాత్రం కనిపించకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందివర్షాలు కురిసిన ప్రతిసారి రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ద్విచక్ర వాహనదారులు, రైతులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం తర్వాత బురదగా మారుతున్న రహదారిపై రాకపోకలు మరింత కష్టతరమవుతున్నాయి.ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు సమస్యను చెప్పినా, వార్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోతే ఇక సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.రహదారి ఏ శాఖ పరిధిలో ఉందనే విషయాన్ని పక్కనపెట్టి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. కనీసం తాత్కాలికంగా గుంతలను పూడ్చడంతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఫిర్యాదు చేసినా స్పందన లేదు.. వార్తలు రాసినా చలనం లేదు.. మరి అధికారులు స్పందించేది ఎప్పుడు? అన్న ప్రశ్న ఇప్పుడు కొమురవెల్లి గ్రామస్థుల్లో వ్యక్తమవుతోంది. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకముందే పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ ఏఈతో పాటు సంబంధిత అధికారులు రహదారి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

## ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చిన స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా.అంజనేయ గౌడ్

గద్వాల అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హైదరాబాద్,రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలు,ఓటర్ల నమోదు కార్యక్రమంపై బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్. కేశవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్. అంజనేయ గౌడ్ హాజరయ్యారు. అనంతరం పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యూహాలను దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీ ఫైనల్ లాంటిదని, ఉద్యోగులు,నిరుద్యోగులు తమకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు.ఓటరు నమోదు ప్రక్రియను కార్యకర్తలు చేయాలని ఆదేశించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని అన్నారు.నవంబర్ 2023 వరకు ఏదైనా యూనివర్సిటీలో డిగ్రీ అర్హత పొందినవారు అర్హులని, ఓటరు నమోదుకు నవంబర్ 6 తుది గడువు ఉంటుందని, పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.పట్టభద్రులందరూ తాజాగా ఓటు నమోదు చేసుకోవాలని పార్టీ శ్రేణులు గ్రామగ్రామానా పట్టభద్రులతో కలిసి నమోదు చేయించాలని,43 నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతుందని అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం శిరోధార్యమని,ఎమ్మెల్సీ విజయంతో ప్రభుత్వానికి చెంప చెల్లుమనించాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో నాగర్ దొడ్డి వెంకట్రాములు,మాజీ జడ్పీటీసీలు బాసు శ్యామల,పద్మ వెంకటేశ్వర రెడ్డి,జి.రాఘవేంద్ర రెడ్డి,కౌన్సిలర్లు చిత్తరి మంజుల రాణి కిరణ్, కమ్మరి సునీత రాము,లత రామకృష్ణ, పులిపాటి వెంకటేష్,చంటన్న, గువ్వల గోపాల్,దుబన్న, మోహన్ యాదవ్, నరసింహులు,సర్పంచులు సాకి దేవిడ్,తిమ్మప్ప,కురవ పల్లయ్య,కోటేష్,పటేల్ జనార్దన్ రెడ్డి,ఆతుకూరి రెహమాన్,లక్ష్మీకాంత్ రెడ్డి,చక్రిధర్ రెడ్డి,అంగడి బసవరాజ్,మోనేష్ మరోజు,గోపాల్, యూసఫ్, ప్రతాప్ ,శ్రీనివాస్ గౌడ్, ఎస్.రాము,గంజిపేట రాజు, నాగరాజు, రామకృష్ణ,బొప్పాల శ్రీనివాస్, మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్న నిర్లక్ష్యం పెద్దమూల్యం ప్రధాన కుడళ్ళు, మలుపుల వద్ద లేని స్పీడ్ బ్రేకర్లు

## ఆర్ అండ్ బి అధికారుల అలసత్వం
## ఎస్పీ ఆఫీస్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి
## అండర్ బ్రిడ్జి ప్రమాదంలో మహిళ మృతి
## ప్రమాదకరంగా రైల్వే అండర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి చివరలు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర):మానుకోట పట్టంలో చిన్న నిర్లక్ష్యాలకు పెద్ద మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్ రోటరీక్లబ్ జనరల్ సెక్రెటరీ శంతన్ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండురోజుల క్రితం ఎస్పీ ఆఫీస్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని పన్నెండేండ్ల బాలుడు మృతి చెందడం బాధకరమన్నాడు. దీనికి కారణం ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేక పోవడమేనని అన్నారు. ముడుకొట్ల సెంటర్, ముత్యాలమ్మ సెంటర్, సర్వేపల్లి రాదాకృష్ణ సెంటర్ తో పాటు ఏరియా ఆసుపత్రి దగ్గర స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లి సెంటర్లో ఓయువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే అన్నాడు. ప్రమాదాలకు ఆస్కారం లేని నెహ్రూసెంటర్లో సైతం గతంలో ఒక రేషన్ డీలర్ మృతి చెందిన విషాద ఘటన పట్టణ ప్రజలు మరచిపోలేదన్నాడు.అండర్ బ్రిడ్జి ఎక్కువ ఏటవాలుగా లోతుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలపై డ్రైవర్లు నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమధ్యనే ఓమహిళ ప్రాణాలు కొల్పోయిందన్నారు. అదేవిదంగా పూలే జంక్షన్లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి వేగంగా వాహనాలు రావడంతో ప్రమాదాలు జాతుగుతున్నాయన్నారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి రెండు చివరలను తలాతోక లేని విధంగా నిర్మించడంతో ప్రమాదాలు నిత్యకృత్యమాయ్యాన్నారు. కురవి రోడ్ వైపు అయితే పెద్ద వాహనాలు, బస్సులు బ్రిడ్జి ఎక్కాలన్నా దిగాలన్నా సర్కస్ ఫీట్లు చేస్తున్నాయని తెలిపారు. పట్టణంలో ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు మానుకోట యువ బైక్ రైడర్లను , పెద్ద వాహనదారులను నియంత్రించ లేక పోతున్నాయని వాపోయారు. పై మూడు ప్రమాదాల్లో స్పీడ్ బ్రేకర్లు లేక భారీ వాహనాలు వేగంతో ఢీ కొట్టిన సందర్భంలోనే ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసి పోయాయని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు.వీటికి తోడు పట్టణంలోని చాలా చోట్ల రోడ్డు మధ్యలో వాటర్ పైపుల వాల్స్ కోసం కోసం తీసిన గుంతలు ప్రమాదలను పెంచుతున్నాయన్నారు. ఉదాహరణకు కంకరబోడ్ సర్కిల్ వద్ద అవసరానికంటే ఎక్కువ వెడల్పు గుంత తియ్యడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వెళ్ళగాక్కారు. లక్ష జనాభాతో పాటు రోజూ ఇరవై వేల మంది ప్రజలు మానుకోటకు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇగ ఇసుక ట్రాక్టర్ల వేగాన్ని ఆపే శక్తి స్పీడ్ బ్రేకర్లకే కాదు అధికారులకు కూడా లేక పోవడం వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతోందన్నాడు. సరకులు, సిమెంటు, ఐరన్, కంకర, మట్టి లోడ్ లతో వచ్చే వాహన చోదకులు క్షణకాలం ఏమరుపాటుగా వున్నా ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. సర్వేపల్లి, నెహ్రూ సెంటర్, రైల్వే అండర్ బ్రిడ్జిలో జరిగిన ప్రమాదాలు పెద్ద వాహనాలవే అనే విషయం మరువొద్దన్నారు. పట్టణంలో చాలా చోట్ల ఇదే సమస్య ఉందన్నారు.

కాబట్టి సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

# జూరాల మిషన్ భగీరథ తాగునీటిపై ప్రజలు ఎలాంటి ఆందోళన వద్దు

## మిషన్ భగీరథ తాగునీటిని ల్యాబ్‌లో నిరంతరం పరీక్షిస్తున్నాం
## మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి చంద్ర కుమార్ రెడ్డి




గద్వాల అక్టోబర్ 03( విజన్ ఆంధ్ర బ్యూరో)మిషన్ భగీరథ పథకం ద్వారా జూరాల నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని శుద్ధి ప్రక్రియ అనంతరం నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షించి,నీటి నాణ్యతను నిర్ధారించిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ గద్వాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి చంద్ర కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తాగునీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ,ల్యాబొరేటరీలో ప్రతి రెండు గంటలకు ఒకసారి నీటి నమూనాలను పరీక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.నిర్వహిస్తున్న పరీక్షల్లో పీ హెచ్,టర్బిడిటీ (నీటి మసకదనం), బ్యాక్టీరియల్ నాణ్యత వంటి ప్రధాన ప్రమాణాల్లో ఎటువంటి ప్రతికూల ఫలితాలు నమోదు కాలేదని తెలిపారు. అయితే, శుద్ధి చేసిన నీరు గ్రామాల్లోని నీటి నిల్వ కేంద్రాలు,పైపులైన్లు, పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరే సమయంలో కూడా నీటి నాణ్యతను కాపాడటం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో నీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన అనంతరం మాత్రమే ప్రజలకు, ఆవాస ప్రాంతాలకు సరఫరా చేయాలని సంబంధిత గ్రామ పంచాయతీలు, నీటి సరఫరా సిబ్బందికి సూచించారు.ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,క్లోరినేషన్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి,అవసరమైన నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తాగునీటిని సరఫరా చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.జూరాల మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,నీటి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ,ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. రవి చంద్ర కుమార్ రెడ్డి తెలిపారు.

# ఫాం హౌస్ సర్వేపై ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబరు 3,కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశం కేంద్రబిందువుగా మారింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెలికట్ట గ్రామాల పరిధిలో కేసీఆర్ ఫాంహౌస్‌ను ఆనుకుని ఉన్న భూముల సర్వే ప్రక్రియ పూర్తికావడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమగ్ర సర్వే నివేదిక సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతికి చేరింది. దీంతో.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.కేసీఆర్ ఫాంహౌస్ లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయని.. వాటిపై 30 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించారు. మర్కూక్ మండల పరిధిలోని భూముల లెక్కలు తేల్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాలు, వెలికట్ట సర్వే నంబర్ 271 భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి హద్దులను నిర్ధారించారు. ఈ సర్వేలో భాగంగా ఎర్రవల్లిలో 244 మందికి, వెలికట్టలో 118 మందికి పైగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.ఈ సర్వే రాజకీయంగానే కాకుండా స్థానికంగానూ అనేక మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అధికారుల ముందుకొచ్చారు.

# మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ అవుతూ.. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

## ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ల తో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లోనూ మార్పులు రావాలని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు నూతన విషయాలను నేర్చుకుంటూ అప్‌డేట్ కావాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు (ఐపీఎస్) సూచించారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన పాత్రలో పూర్తి న్యాయం చేస్తూ, బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అన్నారు.మెన్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఫాదర్ రోల్‌లో ఉంటే, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు మదర్ రోల్‌లో ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. స్టేషన్ పనితీరు, సిబ్బంది క్రమశిక్షణను పటిష్టం చేయడంలో సీనియర్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. తమ అనుభవాన్ని ఉపయోగించి కొత్తగా విధుల్లోకి వచ్చిన సిబ్బందికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఇటీవల సర్వీసులోకి వచ్చిన కొత్త బ్యాచ్ సిబ్బంది పోలీస్ శాఖ క్రమశిక్షణ, నియమ నిబంధనలు, విధి విధానాలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.మీ సర్వీస్‌ను మీరు గౌరవంగా నిర్వహించండని సూచించారు. ప్రతిరోజూ చేసే విధుల్లో చిన్నచిన్న మెరుగుదలలు తీసుకురావడం ద్వారా పోలీసింగ్‌లో క్వాలిటీ ఆఫ్ ఫంక్షన్ పెంచాలని అన్నారు. చట్ట ప్రకారమే విధులు నిర్వహిస్తూ, తప్పు చేయాలనే ఆలోచన కూడా రాకుండా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారుప్రభుత్వం తరఫున విధులు నిర్వహిస్తున్న మనం అన్ని వర్గాల ప్రజలతో, అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయంతో, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో ఓపికగా, గౌరవంగా మాట్లాడి, వారి సమస్యలను చట్టపరమైన పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నా,సేవలో చివరి రోజు వరకు అదే బాధ్యత, నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. చేతిలో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుంటూ, సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు.

# 94వ రోజు కొనసాగిన లయన్స్ క్లబ్ 'అన్న దానం'



నారాయణపేట అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయ న్స్ క్లబ్ ఆఫ్ నారాయ ణపేట్ట ఆధ్వర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానము కార్యక్రమ ము శనివారం నాటికి 94 వ రోజు కు చేరుకుంది. లైన్స్ క్లబ్ అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో కొనసాగింతోంది.లయన్ వినోద్ పాటిల్ వారి తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం స్పాన్సర్ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సత్యనారాయణ చౌరస్తా లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ సమా జంలో అవసర మైన వారికి అండగా నిలవడం, సామా జిక బాధ్యత గా భావి స్తూ,లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్య క్రమాలు కొన సాగిస్తున్నామని తెలి పారు.ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ శ్రీనివాస్ లాహోటి,కన్నా జగదీష్, పుత్పాక్ రమేష్, డాక్టర్ సచిన్ , కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగులకు చేయూత పింఛన్లు అందేలా చూడాలి

## దివ్యాంగుల పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



ధరూర్ అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు అధికారులను ఆదేశించారు.ధరూర్ మండలంలోని పెద్దపాడు, వామనపల్లి గ్రామాల్లో శనివారం అదనపు కలెక్టర్ నర్సింగ రావు చేయూత దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ధ్రువీకరణ సందర్భంగా దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు తదితర అంశాలను పరిశీలించి,అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ధ్రువీకరణ పూర్తయిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో సక్రమంగా నమోదు చేసి, డేటాను ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు,సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జ్యోతిర్వాస్తు విద్యాపీఠం లో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

-వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి,నిర్మలా జగ్గారెడ్డి

-మహిళలతో సామూహిక వ్రతం



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :(విజన్ ఆంధ్ర)సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు.అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

# మానసిక స్థైర్యం, స్త్రీ సాధికారతే 'బియాండ్ ది హొరైజన్' లక్ష్య

## కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా
## మహిళలు ఎందులోనూ తక్కువ కాదు..మూస ధోరణులు మారాలి: మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే 'బియాండ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచార యాత్ర ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, కష్టాలు, మానసిక కుంగుబాటును ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'బియాండ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచార యాత్రపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. యాత్ర ఉద్దేశాలు, ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమైన అంశమన్నారు. భవిష్యత్తు గురించి అతిగా ఆందోళన చెందకుండా, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ జీవితాన్ని సానుకూల దృక్పథంతో కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో బాలురు, బాలికల మధ్య ఎలాంటి వివక్ష, అసమానతలు ఉండకూడదని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా ఏదైనా విషయంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పుడు వారిని చులకనగా చూడకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులు, మిత్రులు, సమాజంపై ఉందన్నారు. ఎవరైనా మానసికంగా కుంగుబాటుకు గురైనట్లు అనిపిస్తే సమస్యను ఒంటరిగా ఎదుర్కోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులు, మిత్రులు లేదా వైద్య నిపుణులతో మాట్లాడటం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, అవసరమైనప్పుడు సహాయం కోరేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.'బియాండ్ ది హొరైజన్' ప్రచార యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా బాలికలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. మానసిక ఆరోగ్యంపై పట్టణ ప్రాంతాలతోపాటు మారుమూల ప్రాంతాల్లోనూ విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కీలకపాత్ర పోషించాలని మీడియా ప్రతినిధులను కోరారు.మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ మాట్లాడుతూ.. తాను ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే పెద్దయ్యాక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడపాలనే కల ఉండేదన్నారు. అయితే అనారోగ్య సమస్యల కారణంగా కొంతకాలం ఆ కలను నెరవేర్చుకోలేకపోయానని తెలిపారు. 2021లో బైక్ నడపడం నేర్చుకున్నానని, 2024లో సొంతంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసినట్లు వివరించారు. 2025లో తొలి ప్రచార యాత్రను నిర్వహించానని, ప్రస్తుతం రెండో 'బియాండ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' ప్రచార యాత్రను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బైక్ యాత్ర ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు మహిళల సామర్థ్యంపై సమాజంలో ఉన్న మూస ధోరణులను మార్చాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మహిళలు ఏ విషయంలోనూ పురుషుల కంటే తక్కువ కాదని, వారికి అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా తమ ప్రతిభను చాటుకోగలరని సెహర్ హష్మీ అన్నారు. మహిళలు బైక్ నడపడం, సాహస యాత్రలు చేయడం వంటి అంశాలపై సమాజంలో ఉన్న సంప్రదాయ అభిప్రాయాలు, మూస ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు, తమ లక్ష్యాలను సాధించేందుకు వారిని ప్రోత్సహించడమే యాత్ర ఉద్దేశమని వివరించారు.అనంతరం మానసిక ఆరోగ్యంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన, మహిళా సాధికారత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రచార యాత్ర రైడర్లు పరాస్, అమిత్ త్యాగి, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

# 2026 యాసంగి సీజన్‌కు రాయితీపై విత్తనాలు

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి
## మండల వ్యవసాయ అధికారి జనార్ధన్

అయిజ అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటల సాగు కోసం రైతులకు రాయితీపై విత్తనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో పప్పు శనగ, జొన్న, మొక్కజొన్న, మినుముల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ తెలియజేశారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలుపప్పు శనగ--1)రకం -ఎన్ బి ఇజి. 452-ప్యాకెట్ -25 కిలోలు-ధర -1,000/-(మొత్తం 60ప్యాకెట్ లు అందుబాటులో ఉన్నవి ),2) రకం--పప్పు శనగ --ఎన్ బిఇజి- 49-ప్యాకెట్ -16 కిలోలు-ధర -752/-(మొత్తం 325 ప్యాకెట్ లు అందుబాటులో ఉన్నవి ),జొన్న -- సిఎస్వీ 41-ప్యాకెట్ -4 కిలోలు-ధర -140/-(మొత్తం 125ప్యాకెట్ లు అందుబాటులో ఉన్నవి ),మొక్కజొన్న --డిఎచ్ఎం- 206-ప్యాకెట్ -4 కిలోలు-ధర -360/-(100ప్యాకెట లలు అందుబాటులో ఉన్నవి ),మినుములు -- విబిఎన్-- 10-ప్యాకెట్ -4 కిలోలు- ధర -100/-(మొత్తం 137ప్యాకెట్ లు అందుబాటులో ఉన్నవి )కావున యాసంగి పంటల సాగుకు అవసరమైన విత్తనాలను రాయితీపై పొందేందుకు ఆసక్తి గల రైతులు సోమవారం నుండి (05/10/2026) తమ పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం లో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) సంప్రదించగలరు.విత్తనాల నిల్వలు పరిమితంగా ఉన్నందున రైతులు అందుబాటులో ఉన్న స్టాక్‌ను దృష్టిలో ఉంచుకొనిరాయితీ విత్తనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ తెలియజేశారు.

# ఈ నెల 5న ప్రజావాణి కార్యక్రమం రద్దు జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3,:( విజన్ ఆంధ్ర)ఈ నెల 5వ తేదీన నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నందున జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

# KGBV పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర)కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మరియు కొనసాగుతున్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. శనివారం జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ (జి+జూ), కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (ఖ+దీఎ) ప్రత్యేక అధికారులు (గాం), జుఔజజకి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లు (గ్జాజు)తో ఖ+దీఎలలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఖ+దీఎలో జరుగుతున్న పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు ఎంతవరకు పూర్తయ్యాయో పని వారీగా వివరంగా సమీక్షించారు. పనుల్లో జాప్యానికి కారణమవుతున్న సమస్యలు, అడ్డంకులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిర్దేశిత ప్రమాణాలు, అంచనాల ప్రకారం నాణ్యతతో జరుగుతున్నాయా లేదో పరిశీలించారు. ప్రతి పనిని ఎప్పటిలోగా పూర్తి చేయగలరో అంచనా గడువులను కూడా తెలుసుకున్నారు. విద్యాశాఖ ఖ+దీఎ అధికారులు, జుఔజజ ఇంజనీర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కొనసాగుతున్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఖ+దీఎలలో పెండింగ్‌లో ఉన్న మరియు కొనసాగుతున్న పనుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జి+జూ, ఖ+దీఎ ప్రత్యేక అధికారులు, జుఔజజ అసిస్టెంట్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 24 పీఎం శ్రీ పాఠశాలల్లో గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ల నియామకం

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర): జిల్లాలోని 24 పీఎం శ్రీ (గ్రీవ్ గాం=×) పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (జఖాబీ) మెరుగైన విద్య, సహాయక సేవలు, సమ్మిళిత విద్య అందించేందుకు గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. సమగ్ర శిక్ష, తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు ఐదు నెలల కాలానికి ఈ నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రతి పాఠశాలకు ఒక గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్‌ను నియమించనున్నారు. ప్రత్యేక విద్యలో నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. B.Ed. Special Education, B.Ed. GeneralÕÂ bi²T Special Education Di- జూశ్రీఃమెఖ్+ జజజూశ్రీఃమె తదితర నిర్దేశిత అర్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. స్థానిక అభ్యర్థులకు గ్రామం, మండలం, జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్లకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 8వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. జిల్లాలోని చిన్నచింతకుంట, మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, బాలానగర్, జడ్చర్ల, కోయిలకొండ, గండీడ్, హన్వాడ, దేవరకద్ర, కౌకుంట్ల, అడ్డకల్, మూసాపేట్, మహబూబ్‌నగర్ అర్బన్, నవాబ్‌పేట, రాజాపూర్, మిడ్జిల్ తదితర మండలాల్లోని 24 పీఎం శ్రీ పాఠశాలల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు.

# కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చూడాలంటూ పాదయాత్ర

## మంథని యువకుల పాదయాత్రకు ముత్తారం బీఆర్ఎస్ నేతల సంఘీభావం

ముత్తారం,అక్టోబర్03(విజన్ ఆంధ్ర) తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని,మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ మంథని యువకులు చేపట్టిన పాదయాత్ర శనివారం ఆరో రోజుకు చేరుకుంది. మంథని నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర ప్రస్తుతం గజ్వేల్ ప్రాంతంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ముత్తారం మండల సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి,ముత్తారం మాజీ వైస్ ఎంపీపీ, సర్పంచ్ సుధాటి రవీందర్ రావు పాదయాత్ర చేస్తున్న యువకులను శనివారం కలిసి మద్దతు ప్రకటించారు. పాదయాత్రకు సంఘీభావం తెలిపి వారికి అభినందనలు,కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాదయాత్ర చేపట్టిన మంథని యువకులు జెన్ని పాల్,గొర్ల వెంకటేష్,కొండ వెంకటేష్‌లతో కలిసి బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పురోగతి సాధించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మంథని నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే పుట్ట మధుకర్ మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని వారు ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంథని యువకులు చేపట్టిన పాదయాత్రకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

# మున్సిపాలిటీల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర)మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల పరిధిలో వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి వెబెక్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని మున్సిపాల్టీల్లో చేపడుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలనీ అన్నారు. ముఖ్యంగా పన్నుల సేకరణ, ఆదాయ వనరులు విభాగంలో ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సులు, దుకాణాల అద్దెలు, ట్యాప్ కలెక్షన్స్ యాక్షన్ ప్లాన్‌పై తదితర విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణాభివృద్ధి, ఇంజినీరింగ్ విభాగంలో భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, లైవ్ ఆథెంటికేషన్ అంశాల పురోగతిని పై కూడా అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్షించి వాటిని వేగవంతం చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, పర్యావరణంకు సంబంధించి పారిశుద్ధ్య పనులు, పారిశుద్ధ్య కార్మికుల హాజరు, మొక్కల పెంపకం, ప్రజా సేవలులో ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ప్రతిరోజూ ఇంటింటికీ తాగునీటి సరఫరా పరిస్థితిని పై కూడా అదనపు కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మహబూబ్ నగర్ మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, భూత్పూర్, దేవరకద్ర, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి పునరుద్ధరణ

## - కొండపాక తహసీల్దార్‌కు గ్రామస్తుల ధన్యవాదాలు



సిద్దిపేట జిల్లా : కొండపాక (విజన్ ఆంధ్ర విలేఖరి)సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడి, తిరిగి స్వాధీనం చేసుకున్న కొండపాక తహసీల్దార్ కి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొండపాక మండల కేంద్రంలోని సర్వే నెంబర్లు 731, 733 లలో ఉన్న 2 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి గతంలో కొంతమంది రాజకీయ అండదండలతో కబ్జాకు గురైంది. ఈ భూమిని గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా మార్చేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చదును చేసే పనులు ప్రారంభించగా, కొందరు వ్యక్తులు ఆ పనులను అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు వెంటనే తహసీల్దార్ కి ఫిర్యాదు చేయగా, ఆయన త్వరితగతిన స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. సదరు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించడానికి లేదా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు అని గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడి గ్రామాభివృద్ధికి సహకరించిన తహసీల్దార్ సమయస్ఫూర్తికి, తక్షణ చర్యలకు కొండపాక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03,(విజన్ ఆంధ్ర)పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, ఉపతహసిల్దార్లు, మండల సర్వేయర్లతో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, భూ సమస్యల పరిష్కారం, భూ రీ-సర్వే ప్రక్రియ, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను మండల, ఆర్.డి.ఓ., మున్సిపల్ కార్పొరేషన్ తదితర స్థాయిలలో పరిశీలించి, జిల్లా స్థాయిలో పరిష్కరించవలసిన అంశాలను వేగంగా క్లియర్ చేయాలని, మీ సేవా పోర్టల్‌లో భూ సంబంధిత డాక్యుమెంట్ల అప్‌డేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని 81 గ్రామాలలో నిర్వహిస్తున్న రీ-సర్వే ప్రక్రియను ప్రామాణిక నిర్వహణ విధానం ప్రకారం కొనసాగించాలని, రీ-సర్వేకు సంబంధించిన సర్వే రికార్డులు, మ్యాపులు, టీపన్‌లు, షెడ్యూల్, సమావేశాల మినిట్స్, ప్రొసీడింగ్స్ తదితర రికార్డులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని మండలాల తహసిల్దార్లు, సర్వేయర్లు నిర్దేశిత ఎస్.ఓ.పి.ను తప్పనిసరిగా పాటించాలని, రోవర్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఆధారంగా సర్వేను



శాస్త్రీయంగా నిర్వహించాలని సూచించారు. ఫారం-9, ఫారం-10 నోటీసులు, సరిహద్దుల నిర్ధారణ, భూ సర్వే తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పిస్తూ, గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమాన్ని పహాణీలు, భూ యాజమాన్య పత్రాలు, ఈ-ల్యాండ్ డాక్యుమెంట్ల సహకారంతో నిర్వహించాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్‌లో గుర్తించిన సమస్యలను సంబంధిత తహసిల్దార్ స్థాయిలో పరిష్కరించి, ఫామ్ ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాలు, అప్పీళ్లను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కరించాలని తెలిపారు. రీ-సర్వేలో అభ్యంతరాల పరిష్కారం, ఫీల్డ్ వాలిడేషన్, సర్వే నిర్ధారణ తదితర అంశాలను సంబంధిత అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు. నోటిఫై చేసిన గ్రామాల జాబితా, సర్వే బృందాల ఉత్తర్వులు, సంప్రదింపు నంబర్లు, రోజువారీ లక్ష్యాలు, అవసరమైన పరికరాలు, ప్రభుత్వ భూములు/భూ రికార్డులు, తాజా పహాణీలు, సంబంధిత ఫారాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సాదాబైనామా పెండెన్సీపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించి, ఆమోదించినవి, తిరస్కరించినవి, తిరస్కరణకు గల కారణాలు, అందిన దరఖాస్తుల సంఖ్య తదితర వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా రైతుల వివరాలు, భూమి వివరాలు, దరఖాస్తుల స్థితిగతులతో కూడిన అబ్స్ట్రాక్ట్‌ను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలోని 22-ూకు సంబంధించిన సమస్యలపై జిల్లా స్థాయిలో పరిష్కరించిన అంశాలు, పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి ప్రస్తుత స్థితిగతులతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. 2025 కు ముందు, 2025 తర్వాత నమోదైన కేసుల వివరాలను వేర్వేరుగా పరిశీలించి, వ్యవసాయ భూముల విస్తీర్ణం, రహదారులు, భవనాలు, నిర్మాణాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సరిపోల్చి సమగ్ర నివేదిక రూపొందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా గుర్తించి, వాటి పరిష్కార స్థితి, పెండింగ్‌కు గల కారణాలను నమోదు చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను క్రమబద్ధంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ సరిహద్దు వివాదాలను మండలాల వారీగా గుర్తించి, ప్రస్తుతం ఉన్న కేసులు, కోర్టు కేసులు, ముఖ్యమైన/ప్రాధాన్యత కలిగిన కేసుల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వివాదాల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ రిక్రూట్ మెంట్ అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతి శిక్షణ స్టడీ మెటీరియల్ పంపిణ

## అభ్యర్థులకు ప్రతి అడుగులో జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుంది జిల్లా ఎస్పీ నితికా పంత్..

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3:(విజిల్ ఆంధ్ర)కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, మార్గదర్శకత్వంలో,పోలీస్ రిక్రూట్మెంట్ కి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం మరియు శిక్షణ అందించే కార్యక్రమాన్ని 31.08.2026న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సుమారు 2,700 మంది అభ్యర్థులు హాజరుకాగా,వారిలో ప్రతిభ ఆధారంగా 150 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత వసతి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ ప్రారంభ దశలో అభ్యర్థులకు అంకగణితం (ూతీఱ్తష్ఎవ్ఱఎ), తార్కిక సామర్థ్యం (=ఖుంశీఅఱఅస్త్ర) అంశాలకు సంబందించిన ఉచిత అధ్యయన సామగ్రిని అందజేశారు. అభ్యర్థుల విద్యా ప్రగతిని నిరంతరం అంచనా వేసి,అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు ఇప్పటివరకు మూడు పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా,ఈరోజు జిల్లా ఎస్పీ నితిక పంత్, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత అధ్యయన సామగ్రిని స్వయంగా పంపిణీ చేశారు. అభ్యర్థులు రాత పరీక్షకు సమర్ధవంతంగా సిద్ధమయ్యేలా అవసరమైన అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉండటశీతో పాటు,వారి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థులు ఎంతో ఆసక్తితో హాజరవుతూ,క్రమశిక్షణతో శిక్షణ పొందుతున్నారు. రాత పరీక్షకు అవసరమైన అకడమిక్ శిక్షణతో పాటు,పోలీస్ రిక్రూట్మెంట్ నిర్వహించే శారీరక దారుడ్య పరీక్షలకు అభ్యర్థులు సమర్ధవంతంగా సిద్ధమయ్యే విధంగా ప్రత్యేక శారీరక శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు కల్పిస్తున్న వసతి,భోజన సదుపాయాల నాణ్యతను జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అభ్యర్థులకు ఎటువంటి



అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. వసతి,భోజనం మరియు శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అదేవిధంగా,ప్రతి వారం అభ్యర్థుల నుండి అభిప్రాయాలను సేకరిస్తూ, శిక్షణలో ఏదైనా అంశం అర్థం కాకపోయినట్లయితే సంబంధిత అంశంపై పునఃశిక్షణ లేదా అదనపు తరగతులను నిర్వహించి, అభ్యర్థులకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఉచిత వసతి శిక్షణ కార్యక్రమం ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. హైదరాబాద్ వంటి నగరాల్లో అందుబాటులో ఉండే నాణ్యమైన పోలీస్ రిక్రూట్మెంట్ శిక్షణను తమ జిల్లాలోనే ఉచితంగా పొందుతున్నందుకు పలువురు అభ్యర్థులు వారి మాటల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ రిక్రూట్మెంట్ కు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన విద్యా మరియు శారీరక శిక్షణతో పాటు సమర్ధవంతమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ,రిక్రూట్మెంట్ ప్రక్రియకు వారిని సన్నద్ధం చేయడం జిల్లా పోలీస్ శాఖ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఆసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ నీలం రవి, పోలీస్ సిబ్బంది మరియు అభ్యర్థులు పాల్గొన్నారు.

# మీ వెన్నంటి భారత్ ఉంది

అమెరికాలో ప్రవాసులకు పీయూష్ గోయల్ భరోసా ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులకు దేశం అండగా నిలుస్తుందన్న మంత్రి యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాలను ఉదహరించిన కేంద్ర మంత్రి ప్రవాస భారతీయులు భారత్, అమెరికాల మధ్య జీవ వారధులుమీరు స్వీకరించిన దేశానికి విశ్వాసంగా ఉండాలని సూచనగాంధీ జయంతి సందర్భంగా షికాగోలో ప్రవాసులతో సమావేశంషికాగోప్రపంచంలో ఏ మూలన ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు తమ దేశం అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. "మీ వెన్నంటి భారత్ ఉంది" అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన ఆయన, స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో మాట్లాడారు. గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లోని భారతీయుల భద్రత కోసం ప్రభుత్వం ఎంతగా తపించిందో ఆయన గుర్తుచేశారు. "మీరు ఏ దేశంలో, ఏ పరిస్థితుల్లో ఉన్నా మీ మాతృభూమి మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబాలకు, మీ పిల్లలకు తోడుగా నిలుస్తుంది" అని గోయల్ స్పష్టం చేశారు. అమెరికా, భారత్ మధ్య ప్రవాస భారతీయులు ఒక జీవ వారధిలాంటి వారని గోయల్ అభివర్ణించారు. "మీలో ప్రతి ఒక్కరూ అమెరికాలో భారత రాయబారులే" అని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు తాము స్వీకరించిన దేశానికి (అమెరికాకు) నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

## జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3:(విజన్ ఆంధ్ర)వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు ఒక దిక్సూచి లాంటివారని, వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు, కుటుంబాన్ని నిలబెట్టిన తీరు నేటి తరం పాటించాలని తెలిపారు. వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని, వారి అనుభవాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధురాలు మహిళా సంఘాలలో సభ్యులుగా చేరితే ఎంతో భరోసా కలుగుతుందని, వ్యక్తిగత సమస్యలు గ్రూపు సభ్యులతో చర్చించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నం. 14567 కు కాల్ చేసి వివరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించిన రాజేశ్వరి, భూదేవి లను శాలువాలతో సన్మానించారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

-స్వశక్తి సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు

-మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు, బస్సులు, సోలార్ ప్లాంట్లు

-ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-03(విజన్ ఆంధ్ర)మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. భూపతిపూర్‌లో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో రూ.1.15 కోట్లతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపును కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు, ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, పెద్దపల్లి నియోజకవర్గంలో 15,715 సంఘాలకు రూ.33.42 కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళలకు రూ.2 లక్షల రుణ బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ యాసంగిలో వరికి బదులు ఆయిల్‌పామ్,



కూరగాయలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. జిల్లాలో గత మూడేళ్లలో సుమారు 3,000 మందికి ఉద్యోగాలు లభించగా, వారిలో 60 శాతం మంది మహిళలేనని తెలిపారు. మహిళలకు పెట్రోల్ పంపులు, టైలరింగ్, వర్క్‌ఫ్రమ్‌హోమ్, ఆయిల్‌పామ్ సాగు తదితర రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అన్నయ్య గౌడ్, డీఆర్‌డీఓ కలిందిని, అడిషనల్ డిఆర్డిఓ రవీందర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు, తదితరులు ,పాల్గొన్నారు.

## విజన్ ఆంధ్ర కథనానికి స్పందన..

# ఫలించిన ప్రభుత్వ స్థల పరిరక్షణ కమిటీ పోరాటం

- కబ్జాకు గురవుతున్న స్థలం మాదే.. స్పష్టం చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు
- సర్వే నంబర్ 143లో ఎకరం 0.08½ గుంటల భూమి బ్యాంకుకు కేటాయింపు.
- అక్రమ నిర్మాణాలకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి
- ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం
- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్



విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
03 Oct 2026 - Page 6
epaper.visionandhra.in

బూడిదిగడ్డ ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను...

- ప్రభుత్వ భూమి కోసం ప్రజల పోరాటం షురూ!
- రెండేళ్లు గడిచినా కమ్యూనిటీ హాల్ కు మోక్షంలేదు?
- గతంలో రూ.70 లక్షలు మంజూరు..
- శిలాఫలకం వరకే పరిమితం అయిన అభివృద్ధి..

కొత్తగూడెం బ్యూరో అక్టోబర్ 02(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ స్థల పరిరక్షణతో పాటు ప్రజల కోసం మంజూరైన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని బూడిదిగడ్డ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని బూడిదిగడ్డ ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 143లోని సుమారు 15 కుంటల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి, ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం సర్వే నంబర్ 143కు సంబంధించిన స్థలంలో 10, 11, 49వ డివిజన్లకు చెందిన స్థానికులు, కమిటీ ప్రతినిధులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలి

సర్వే నంబర్ 143లోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించాలని కమిటీ కోరింది. స్థలంలో కొంత భాగంలో ఇప్పటికే పట్టణ ప్రకృతి వనం కొనసాగుతోందని, మిగిలిన ప్రాంతాన్ని కూడా ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను అధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించి స్పష్టం చేయాలని కోరారు.

ఇంటి నంబర్ల వ్యవహారంపై విచారణ

గతంలో ఎనిమిది మందికి ఇంటి నంబర్లు జారీ అయ్యాయని, ఫిర్యాదుల అనంతరం వాటిని తొలగించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అయితే సంబంధిత ప్రాంతంలో ఇళ్లు, గుడిసెలు లేదా శాశ్వత నిర్మాణాలు లేవని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నంబర్లు ఏ ప్రాతిపదికన జారీ చేశారు? వాటి జారీకి సమర్పించిన పత్రాలు ఏమిటి? ఫిర్యాదుల అనంతరం ఎందుకు తొలగించారు? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. తొలగించిన ఇంటి నంబర్లను ఆధారంగా చేసుకుని ప్రభుత్వ స్థలంపై హక్కులు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అసలు రికార్డులను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.70 లక్షల కమ్యూనిటీ హాల్ ఎప్పుడు?

బూడిదిగడ్డలో ప్రజల అవసరాల కోసం ప్రతిపాదించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.70 లక్షల నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడంపై కమిటీ ప్రశ్నించింది. 2024లో నిధులు మంజూరు చేసి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదని పేర్కొంది. మంజూరైన నిధులను వినియోగించుకుని 10వ డివిజన్‌తో పాటు 11, 49వ డివిజన్ల ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్‌ను త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేసింది. వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా అవసరాల కోసం ఈ భవనం ఉపయోగపడుతుందని, ఇప్పటికే నిధులు మంజూరైనందున ఇకపై జాప్యం చేయకుండా పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేయాలని కోరింది.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

ప్రెస్‌మీట్ అనంతరం బూడిదిగడ్డ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 143లోని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించాలని కోరారు. అలాగే రూ.70 లక్షలతో మంజూరైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ ప్రక్రియలను వేగవంతం చేసి పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ప్రభుత్వ స్థలం ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి. మంజూరైన నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని ఇక ఆలస్యం చేయకుండా ప్రారంభించాలి. స్థలానికి సంబంధించిన రికార్డులు, ఇంటి నంబర్ల జారీ--తొలగింపు వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలి" అని కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, ఈరెల్లి నాగేశ్వరరావు, గౌడుగు శ్రీధర్ యాదవ్, కామ్రేడ్ పలనాటి ప్రశాంత్, ఈసం చిన్నస్వామి, సబ్బని సంపత్, ఎండి కాజా, రాజయ్య, రాజు తదితరులతో పాటు బూడిదిగడ్డ బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు సంబంధించి విజన్ ఆంధ్రలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు సంబంధిత అధికారులు,జిల్లా సహకార కేంద్ర బ్యాంకు స్పందించారు. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ 143లో సర్వే నంబర్ 143కు సంబంధించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న అంశంపై "బూడిద గడ్డలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం" అనే శీర్షికతో విజన్ ఆంధ్రలో ప్రచురితమైన కథనం అధికారుల దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు భూమికి సంబంధించిన పత్రాలు,ప్రభుత్వ ఉత్తర్వులు,తమకు కేటాయించిన వివరాలను వెల్లడించారు. సర్వే నంబర్ 143లోని ఎకరం 0.08½ గుంటల భూమిని బ్యాంకు భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఆర్‌సీ నంబర్ G/261/2017 ద్వారా అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఐఏఎస్ భూమిని బ్యాంకుకు కేటాయించినట్లు తెలిపారు.

### బ్యాంకు భవన నిర్మాణం కోసం భూమి కేటాయింపు

బ్యాంకు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం,కొత్తగూడెం పట్టణం,మండల పరిధిలోని సర్వే నంబర్ 143లో ఎకరం 0.08½ గుంటల భూమిని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయ భవన నిర్మాణం కోసం కేటాయించారు. భూమికి సంబంధించిన పహాణి తదితర రెవెన్యూ రికార్డులు కూడా తమ వద్ద ఉన్నాయని బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు జరిగిన అనంతరం,సంబంధిత రెవెన్యూ అధికారులు భూమి పరిస్థితిని పరిశీలించినట్లు,ఆ సమయంలో భూమి ఖాళీగా ఉండి ఎలాంటి ఆక్రమణలు లేవని నివేదికలు ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. అనంతరం భూమిని బ్యాంకు భవన నిర్మాణానికి వినియోగించుకునేలా ముందస్తు స్వాధీనం కూడా అప్పగించినట్లు పేర్కొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తుల కదలికలపై బ్యాంకు అభ్యంతరం

అయితే ఇటీవల కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు సదరు స్థలంలోకి ప్రవేశించి,భూమికి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు నిర్మాణాలకు అనుకూలంగా స్థలాన్ని సిద్ధం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బ్యాంకు అధికారులు తెలిపారు. కొందరు వ్యక్తులు తమ వద్ద పట్టా ఉందని చెబుతూ,బ్యాంకుకు కేటాయించిన భూమిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ పరిణామంపై బ్యాంకు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తూ,తమ సంస్థకు కేటాయించిన భూమిలో బయటి వ్యక్తులు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. భూమిపై తమకు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా చట్టబద్ధమైన హక్కు, స్వాధీనం ఉన్నందున ఇతర వ్యక్తులు జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

### అధికారులకు బ్యాంకు ఫిర్యాదు

సర్వే నంబర్ 143లోని భూమిపై ఇతర వ్యక్తులు ప్రవేశించకుండా,ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని కొత్తగూడెం కార్పొరేషన్ అధికారులను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కోరింది. ఇదే విషయాన్ని పోలీసు అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. తమ బ్యాంకు తరఫున ఈ భూమిలో నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్న సమయంలోనే ఇతర వ్యక్తుల కదలికలు కనిపించాయని అధికారులు తెలిపారు. దీంతో భూమి రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR BHADRADRI KOTHAGUDEM
PRESENT: SRI RAJEEV GANDHI ...
Sub: LAND ALIENATION ...
ORDER:



THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD., KHAMMAM
KOTHAGUDEM BRANCH
DCCB KHAMMAM
BajanMandir Road, Kothagudem, BHADRADRI KOTHAGUDEM, TELANGANA 507101

Kothagudem
03.10.2026

To
The Commissioner
Kothagudem Corporation
Kothagudem

Sub: Land allocation letter given by collector - information in this regard -reg

Sir/Madam

We The District Co Operative Central Bank Ltd Working with 55 branches with in the erstwhile Khammam District and with 22 Branches in Bhadradri Kothagudem District bring to your notice that we have been allotted Ac.0.08 ½ Gts of land in Sy.No 143 by Government Order with Rc.No.G /261/2017 by the then Collector Sri.Rajeev Gandhi Hanumanthu IAS Garu. And regarding this land the government had also given us the Pachamama Copy. And we are having the possession of Land with our bank only.

And today we came to know that some people have entered the land and drawn line with white powder and started digging the land for construction purpose. Meanwhile local people have called police and informed the same to them. The people who came and digging the land said that they are having the patta for that land holding.

And now we kindly that as the said land was entrusted to us and we are legally valid possessors of laid land we request your authorities to give orders such that no outsiders are permitted to enter or do construction in in the said land as we have already proposed to start construction in the said land in this month itself.

Cc To:
1Town Station House Officer,Kothagudem




### "విజన్ ఆంధ్ర" కథనంతో కదిలిన అధికారులు

సర్వే నంబర్ 143లోని భూమిపై అనుమానాస్పద కదలికలు జరుగుతున్న విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన విజన్ ఆంధ్ర కథనంపై స్పందన రావడం పట్ల దామోదర్ హర్షం వ్యక్తం చేశారు. పత్రికలు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తే సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో విజన్ ఆంధ్ర ప్రచురించిన కథనం ద్వారా భూమికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ భూముల విషయంలో ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా,పత్రాలు మరియు ప్రభుత్వ రికార్డుల ఆధారంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు స్థలాల కొరత ఏర్పడే అవకాశం ఉందని,అందువల్ల ముందుగానే వాటిని గుర్తించి రక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు.

### ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యం- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్

ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వేల్పుల దామోదర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాలు,ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం తమ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగానే సర్వే నంబర్ 143లోని భూమి అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు.

### రికార్డుల ఆధారంగానే తుది నిర్ణయం ఉండాలి

సర్వే నంబర్ 143కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు,రెవెన్యూ రికార్డులు,పహాణి,భూమి స్వాధీనం వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని దామోదర్ కోరారు. ఎవరైనా తమకు భూమిపై హక్కు ఉందని పేర్కొంటే సంబంధిత ఒరిజినల్ పత్రాలు,ప్రభుత్వ రికార్డుల ఆధారంగా మాత్రమే పరిశీలన జరగాలని సూచించారు. ప్రభుత్వ భూముల విషయంలో వివాదాలు తలెత్తకుండా ముందస్తుగా హద్దులను నిర్ధారించి,ప్రభుత్వ స్థలాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆయన కోరారు. అలాగే ఇప్పటికే కేటాయించిన ప్రభుత్వ భూములను సంబంధిత సంస్థలు వినియోగించుకునేలా అధికారులు సహకరించాలన్నారు. ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన స్థలాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే ప్రయత్నాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని దామోదర్ కోరారు. ఒకసారి అక్రమ నిర్మాణాలు ఏర్పడిన తర్వాత వాటిని తొలగించడం కష్టతరంగా మారుతుందని,అందువల్ల ముందుగానే చర్యలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వ ఆస్తులను కాపాడవచ్చని అన్నారు. సర్వే నంబర్ 143లోని భూమిపై ప్రస్తుత పరిస్థితిని అధికారులు పరిశీలించి,ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాల ప్రకారం భూమిని రక్షించే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



### పోరాటం కొనసాగుతుంది

ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం తమ పోరాటం ఇక్కడితో ఆగదని వేల్పుల దామోదర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన స్థలాలు,ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా ప్రజల తరఫున తమ వంతు బాధ్యతగా ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు, ప్రజలు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ఆక్రమణలను అరికట్టగలమన్నారు. సర్వే నంబర్ 143 భూమికి సంబంధించిన అంశంలో కూడా అధికార యంత్రాంగం సమగ్రంగా పరిశీలించి, రికార్డుల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ స్థలం ప్రజల ఆస్తి అని,దానిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తమ కమిటీ తరఫున నిరంతరం ప్రజల పక్షాన నిలబడతామని వేల్పుల దామోదర్ తెలిపారు.

---

## ఇండియా కూటమి ఆధ్వర్యంలో అక్టోబర్ 7 న నిరసన ర్యాలీ.



నిజామాబాద్ అక్టోబర్03:( విజన్ ఆంధ్ర) : కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఈనెల 7వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాట్పల్లి నగేష్ రెడ్డి తెలిపారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇండియా కూటమిలోని మిత్ర పక్షాలతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతు కేంద్ర ఎన్నికల సంఘము నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పూర్తిగా బీజేపీ పార్టీకి అనుకూలంగా ఉందని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలనీ అఖిల పక్షం తరుపున డిమాండ్ చేస్తునమాని, ఆయనను తొలగించేతవరకు ఈ వారం రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ మరియు మిత్ర పక్షాలతో కలిసి వివిధ రూపాలలో నిరసనలు చేస్తామని తెలిపారు. దేశ ప్రధాని మోదీ, అమిత్ షా కు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తోత్తుగా వ్యవహారిస్తున్నారని, రాష్ట్రములో ఈ సర్ ప్రోగ్రాంలో కొన్ని లక్షల మంది ఓట్లు తొలగించారని,వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ, మిత్ర పక్షాలు తీసుకుంటాయని ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్రం వచ్చి 79సంవత్సరాలలో దేశంలో అనేక పార్టీలు దేశాన్ని పాలించయని ప్రతి 10సంవత్సరాలకు ఒకసారి ఓటర్ల సవరణను చేస్తారని దాంట్లో భాగంగా బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘము రెండు కలిసి బీజేపీ కి అనుకూలంగా ఉన్న ఓట్లను ఉంచి మిగతా ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ ఈ సర్ వల్లనే ఓడిపోయారని ఈ విధంగా అన్ని రాష్టాలలో అమలు చేసే ప్రయత్నం బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘము చేస్తున్నాయని మండిపడ్డారు. జాతీయ ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం,మంగళవారం నాడు మండల కేంద్రాలలో ధర్నా కారక్రమాలు నిర్వహించడం జరుగుతుంది,బుధవారం జిల్లా కేంద్రంలో బారీ నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ , వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ , రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్ , సీపీఐ ఎం ఎల్ వనమాల కృష్ణ , ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి కటారి రాములు , సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు , సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ ఏం ఎల్ నగర కార్యదర్శి సుధాకర్ , సయ్యద్ ఫెరోజ్ అలీ , రఘురామ్ ,పిట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సరోగసీ దరఖాస్తులపై సమగ్ర పరిశీలన

## ఐదు దరఖాస్తులను పరిశీలించిన జిల్లా స్థాయి ఏఆర్టి--సరోగసీ బోర్డు

- అర్హతలు, వైద్య ప్రమాణాలు, చట్టబద్ధత ఆధారంగా మూడింటికి ఆమోదం
- అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా నిబంధనల అమలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఏఆర్టి-సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సరోగసీ ప్రక్రియలో వైద్యపరమైన అవసరం, చట్టబద్ధత, పారదర్శకత, నైతిక ప్రమాణాలతో పాటు భవిష్యత్ తల్లి, శిశు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ దరఖాస్తులను బోర్డు సమగ్రంగా పరిశీలించింది. గర్భధారణకు సంబంధించిన వైద్యపరమైన సమస్యలు, గర్భాన్ని ధరించి శిశువును మోసే సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలు తదితర అంశాలను నిపుణుల అభిప్రాయాలతో సమీక్షించారు. దరఖాస్తుదారుల అర్హతలు, సమర్పించిన వైద్య నివేదికలు, అవసరమైన పత్రాలను పరిశీలించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ శివకిరణ్ పాల్గొన్నారు. సరోగసీకి సంబంధించి మొత్తం 5 దరఖాస్తులను బోర్డు పరిశీలించగా, సరోగసీ (నియంత్రణ) చట్టం--2021లోని నిబంధనలు, నిర్దేశిత వైద్య ప్రమాణాలు, దరఖాస్తుదారుల అర్హతలు, సంబంధిత ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని 3 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. ఆయా దరఖాస్తుదారులకు వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది. సరోగసీ ప్రక్రియలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు ఎలాంటి అవకాశం లేకుండా చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని బోర్డు స్పష్టం చేసింది. అర్హత కలిగిన దంపతుల దరఖాస్తులను మాత్రమే పూర్తి వైద్యపరమైన, చట్టబద్ధమైన పరిశీలన అనంతరం ధ్రువీకరించనున్నట్లు డాక్టర్ కె. ఆనంద్ తెలిపారు. సరోగసీ ప్రక్రియలో పారదర్శకత, వైద్య నైతిక ప్రమాణాలు, తల్లి-శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

---

## సబ్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని ఇచ్చిన బాల్కొండ డబల్ బెడ్ రూముల బాధితతులు

### ఎంపిక జాబితాను రద్దు చేయాలనీ కోరిన ప్రజలు

ఆర్మూర్ (బాల్కొండ)-నిజామాబాదు జిల్లా) అక్టోబర్ 03- బాల్కొండ లో డబల్ బెడ్ రూముల బాధితతులు సబ్ కలెక్టర్ ఆర్మూర్ కు వినతి పత్రాన్ని ఇచ్చి గత నెల 30 అర్ధరాత్రి ఎంపిక చేసిన లబ్ది దారుల్లో వ్యసాయ భూములు ఒక్కొక్కరికి 2ఇల్లు కూడా ఉన్నాయని, శనివారం రోజు ఆర్మూర్ కు నిజామాబాదు అడిషనల్ కలెక్టర్ రావడం తో అడిషనల్ కలెక్టర్ సమక్షంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని ఇస్తూ ప్రజా పాలనలో దరఖాస్తూ చేసుకున్న మా పేర్లకు ఆన్లైన్ నుంబర్ లేవనే సాకుతో గత నెల 30 రాత్రి గ్రామ పంచాయతీ లో కూర్చుండి లబ్ది దారుల జాబితాను ఎలా తైయారు చేసారని ఆరోపిస్తూ ఎంపిక చేసిన జాభితాను రద్దు చెయ్యాలని వినతి పత్రాన్ని ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వశీ ప్రజా పాలన, గ్రామ సభలు ఏర్పాటు చేయగ డబల్ బెడ్ రూముల కోసం దరఖాస్తుల నమోదు చేసిన రిజిస్టర్లు కనపడ కుండా పోవడమే కాదు బాల్కొండ లో డబల్ బెడ్ రూముల పంపిణిలో జరిగిన అవక తవకల పై విచారణ చేస్తే జరిగిన అవక తవకలు బయట పెడతామని నిజామాబాదు జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ ప్రదీప్ కుమార్, నర్సింగ్ రావు, కార్యదర్శి డా, పవన్ కుమార్ వినతి పత్రాలు సమర్పించారు. ఎంపిక చేసిన లబ్ది దారుల్లో వ్యవసాయ భూములతో పాటు ఒక్కొక్కరికి 2ఇల్లు కూడా




ఉన్నాయని వివరించారు స్థానిక సర్పంచ్ తో పాటు సభ్యులు గ్రామ పంచాయతీ లో కూర్చుండి జాబితానే మల్లి రాత్రి 10 గంటలకు ఎంపిక ఎలా చేసారని వారు ప్రశ్నించారు. ఇది ఇలా ఉండగా గత నెల 30 న రాత్రి 8:00 లకే లక్కీ డ్రా ప్రారంభం వేదికకు ముందే (63) మంది లబ్ది దారులతో పాటు లబ్ది దారుల పేర్లను సిఫారసు చేసిన రాజకీయ నాయకులు రావడం విశేషం. 2వ విడుత డబుల్ బెడ్ రూము అనర్హుల జాబిత మరియు ఆన్లైన్ నంబర్లు ఉన్న వారి (99) మంది లబ్ది దారుల పేర్లు మండల అభివృద్ధి అధికారి ద్వారా తహసిల్దార్ బాల్కొండ గారికి అంద జేశారు జాబితా లో క్రమ సంఖ్య (01) నుండి(54) ఇంటి నుంబర్ లు ఉండగా క్రమ సంఖ్య (01) నుండి (55)నుండి (99) వర్షకు ఇంటి నెంబర్లు ఎందుకు చూపలేదని ప్రజల ఆరోపణలు ఉన్నాయి. ఆన్లైన్ వ్యవ హారంలో అనర్హుల జబితాలో ఆన్లైన్ నెంబర్ లేకుండానే సీరియల్ నెంబర్ 1 నుండి 407 వరకు ఇంటి నెంబర్లు ఉన్నాయ. కానీ 408 నుండి 987 ఆన్లైన్ నుంబర్లు ఇచ్చి, ఇంటి నెంబర్లు ఇవ్వలేదని,ప్రజా పాలనలో దరఖాస్తూ చెసు కున్న అభ్యర్ధులకు ఆన్లైన్ లో నమోదు కాకుండా చేయడం ఇదేశీ లాజిక్కో అర్థం కావడం లేదని వారు ప్రశ్నించారు. డబల్ బెడ్ రూమ్ ల ఎంపికల్లో ఆర్థికంగా, వ్యవ సాయ భూములు,ఇల్లు ఉన్న వారికే ఇచ్చుకున్నారని పైగా ముస్లిం మైనారి టీలు బి. సి. ల కోటలో ఇల్లు రాగ మల్లి ముస్లిం మైనారిటీల కోటలోనే కూడా డబల్ బెడ్ రూములు ఇచ్చుకున్నారని ప్రజలఆరోపణ .మరో విచిత్రం ఏమంటే ఆర్మూర్ నుండి 3 నెలల క్రితం వచ్చిన వారికి, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో పనిచేసే వారికి, వ్యవసాయ భూములు,ఇల్లతో పాటు ఆర్థికంగా బాగున్నా వాళు ,,మరో ఇద్దరూ విలేకరుల బశీదుత్వం వాళ్లకు ప్రైవేట్ ప్రాక్టీస్ డాక్టర్ కుటుంబీకులకు అన్ని రాజ కీయా నాయకుల రక్త సంబందికులకు డబల్ బెడ్ రూము ఎలా వచ్చిందోనని దీనిపై సబ్ కలెక్టర్ స్థాయి ముందు విచారణ చెయ్యాలని వినతి పత్రంలో కోరారు.

---

## అందోల్ లో కాంగ్రెస్‌కు కొత్త సారథులు..

- 9 మండలాలతో పాటు జోగిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం..
- మంత్రి దామోదర్ రాజనర్సింహతో నూతన అధ్యక్షుల భేటీ...



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 03 : అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు అందోల్--జోగిపేట పట్టణ కాంగ్రెస్ కమిటీకి నూతన అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అందోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షుడిగా లింగన్నగారి సతీష్ కుమార్, చౌటకూరు మండల అధ్యక్షుడిగా బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షుడిగా మల్లన్నగారి దుర్గారెడ్డి నియమితులయ్యారు. అలాగే రాయకోడు మండల అధ్యక్షుడిగా పట్లోళ్ల కేదారినాథ్, వట్ పల్లి మండల అధ్యక్షుడిగా విశ్వాస్, ఆందోల్--జోగిపేట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి.జి. వెంకటేశం, ముదిరాజ్ రేగోడు మండల అధ్యక్షుడిగా దిగంబరరావు, అల్లాదుర్గ్ మండల అధ్యక్షుడిగా కొప్పుల శేషారెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షుడిగా పట్లోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. నూతనంగా నియమితులైన మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శనివారం సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వారికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నూతనంగా నియమితులైన అధ్యక్షులపై ఉందని మంత్రి సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. నూతనంగా నియామకమైన అధ్యక్షులకు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు గజ్జాడ కిషన్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభ రెడ్డి జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు







---

## రెండవ రోజు కొనసాగుతున్న ధర్నా

*కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలి లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం...*

*శిబిరం వద్దకు వచ్చిన జిల్లా అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ పలు డిమాండ్ లతో కూడిన పత్రాన్ని అంధేజేసిన కార్మికులు.*

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్3:( విజన్ ఆంధ్ర) : మెడికల్ కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(గూ×ుఖజ) ఆధ్వర్యంలో కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పే స్లిప్, యూనిఫామ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2వ రోజు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్(గూ×ుఖజ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ.. కార్మికులతో నిరంతరం విధులు నిర్వహించించుకుంటూ వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో లిభీం ఏజెన్సీలి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, పే స్లిప్, యూనిఫామ్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకుని, కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే యూనియన్ ఆధ్వర్యంలో తదుపరి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. ధర్నాలో లిఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్, భోగే ఉపేందర్,ఉపాధ్యక్షులు మహేష్,కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిజిహెచ్ లిఆసిఫాబాద్ బ్రాంచి గౌరవ అధ్యక్షులు నీల,అధ్యక్షులు మమత,వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, సితార్ బేగ్,ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్,ఉపాధ్యక్షులు రాధా,తిరుపతి,నరేందర్ సహాయ కార్యదర్శిలు సువర్ణ,అమృత,వాణి ప్రమీల కోశాధికారి మాధవిలి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు మున్సిపాలిటీలో దసరా పేరుతో లక్షల దోపిడీకి తెరలేపిన చైర్మన్, కమిషనర్

**- కౌన్సిలర్ వాణి కుమార్ సంచలన ఆరోపణ**

ములుగు అక్టోబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు నూతన మున్సిపాలిటీలో అడుగుపెట్టిన 9 నెలలకే దోపిడీకి తెరలేపారా? దసరా పండగ పేరుతో కౌన్సిల్ తీర్మానం లేకుండా, కౌన్సిలర్లకు తెలియకుండా దొడ్డిదారిన లక్షల రూపాయల పనులకు ముహూర్తం పెట్టారని 19వ వార్డు కౌన్సిలర్ గంధకోట వాణి కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆరు లక్షల పనికి 30 లక్షల బిల్లు.. కమిషన్ల కోసమేనా?

తోపుకుంట, గట్టంపల్లి, పాలసాపుపల్లి, మాధవరావుపల్లి, బండారుపల్లి ప్రాంతాల్లో గతంలో గ్రామపంచాయతీల హయాంలో దసరా లైటింగ్, ఆర్చి, కటౌట్లు, సౌండ్స్ కు ఆరు లక్షలు ఖర్చయ్యేదని, ఇప్పుడు అదే పనికి 10 నుండి 30 లక్షలు పెట్టడం వెనుక మతలబు ఏమిటని వాణి కుమార్ ప్రశ్నించారు. ఇది అవివేకం కాదు.. కమిషన్ల కోసం పన్నిన పన్నాగమేనని ధ్వజమెత్తారు.

గుంతల రోడ్లకు మట్టి లేదు.. దసరాకు లక్షలా?

తన వార్డులోని మంజునాథపురం, ప్రేమ్ నగర్, కృష్ణా కాలనీ, బీడీ కార్మికుల కాలనీల్లో ప్రజలు గుంతల రోడ్లల్లో నడవలేక తట్టెడు మట్టి పోయమని వేడుకుంటే నిధులు లేవంటున్న చైర్మన్, కమిషనర్.. దసరా పేరుతో లక్షలు దుర్వినియోగం చేయడానికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయని నిలదీశారు.

విశ్వం సౌండ్ తో చీకటి ఒప్పందమా?

కౌన్సిల్ మీటింగ్ తీర్మానం కూడా లేకుండా హడావుడిగా నర్సంపేట విశ్వం సౌండ్ వారితో చీకటిలో ములాఖత్ కావడం సరైనదేనా? అందరి ముందు తీర్మానం చేస్తే కమిషన్లు రావనే భయంతోనే ఈ గోప్య వ్యవహారమా? అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ దుబారా ఖర్చులతో అభివృద్ధి కుంటుపడి ములుగు ప్రజలకు శాపంగా మారే ప్రమాదం ఉందని, కమిషనర్ ఇప్పటికైనా కళ్లు తెరిచి శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకుంటే ఏ స్థాయి నిరసనకైనా వెనకాడబోమని శనివారం ఒక ప్రకటనలో చైర్మన్, కమిషనర్ ను కౌన్సిలర్ గంధకోట వాణి కుమార్ హెచ్చరించారు.

## మండల కేంద్రానికి అన్యాయం చేయవద్దు

**- ఆధారాలు లేకుంటే నేను దేనికైనా సిద్ధం..**
**- పొజిషన్ రాంగ్ అయితే చిలిపిచేడ్ నుండి నేను విరమించుకుంటా..**
**- గెజిట్ చిలిపిచేడ్ కార్యాలయాలు ఇక్కడే నిర్మించాలి.**
**- సర్పంచ్ అనిల్ కుమార్**



చిలిపిచెడ్ అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : చిలిపిచెడ్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో చిలిపిచేడ్ మండల కేంద్రం లోని చిలిపిచేడ్ గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్, మండలం మాజీ ఎంపీపీ వినోద దుర్గారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ... మండల తాసిల్దార్ కార్యాలయానికి కేటాయించిన స్థలానికి ఆధారాలు లేకుంటే తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానని, మండల కార్యాలయాలకు కేటాయిస్తున్న స్థలాలకు సంబంధించిన పొజిషన్లో రాంగ్ అని తేలకపోతే తన ప్రయత్నాన్ని విరమించుకుంటానని ఒకవేళ శీలంపల్లి గేటు వద్ద చూపించిన స్థలం లో ఉన్న తప్పులను నిజాయితీ చేస్తే అక్కడివారు వారి ప్రయత్నాన్ని నియమించుకుంటారని ప్రశ్నించారు. చిలిపిచేడ్ మండలం గెజిట్ ఉంది, మండల కార్యాలయాలు చిలిపిచేడ్ లోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని అన్నారు. శీలంపల్లి గేటు వద్ద ఎమ్మార్వో ఆఫీస్ కు ప్రపోజల్ పూర్తయిందని, పొజిషన్ ఒకరు ఉండడం పూర్తి ఆధారాలతో సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించడం జరిగిందని ఆయన అన్నారు. అధికారుల సహకారం చేయగా తప్పుడు రిపోర్టు ఎలా పంపుతారు అని, ఇప్పటికీ ఎమ్మార్వో కార్యాలయంకు గ్రామపంచాయతీ భవనం ఇచ్చామని ఆయన అన్నారు. మండల కార్యాలయం కోసం ఎకరా 10 గుంటలు మెయిన్ రోడ్డు కు ఇస్తామని రైతులు వినోద్ దుర్గా రెడ్డి, కంచనపల్లి మల్లేశం, గొల్ల నాగభూషణం, జక్కన్న గారి భూపాల్ రెడ్డి నరసింహారెడ్డిలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు అని అన్నారు. మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సహకారంతోనే అందరు అభిప్రాయాలు మేరకు చిలిపిచెడ్ మండలం 2016లో ఏర్పడిందని అన్నారు. తాసిల్దార్ కార్యాలయం చిలిపిచెడ్ లో వెంటనే జాగుండదని, గ్రామ పెద్దలు అందరం యువకులం గ్రామసభ ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవంగా తీర్మానం చేసి భూమి సేకరణ చేయడం జరిగిందని, అందరూ సర్పంచులు పెద్దలు పార్టీలకు అతీతంగా మండలం చిలిపిచెడ్ లో ఉండాలని కోరుకుంటున్నాం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. చిలిపిచెడ్ మండల కార్యాలయాలకు 2 కోట్ల 25 లక్షలు మంజూరు చేయడం సంతోషమని, ఇదే ఉత్సాహంతో అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలిపిచెడ్ గ్రామ సర్పంచ్ అనిల్, ఫైజ్యా తండా సర్పంచ్ దరియా, బద్రియా తాండా సర్పంచ్ కున్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు పాడేపు పండరి, ఉపసర్పంచ్ శ్రీరాములు, నాయకులు గంగాధర్, హన్మంత్, లక్ష్మణ్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేలా కోర్ట్ డ్యూటీ అధికారులు కృషి చేయాలి

**- వనపర్తి డీఎస్పీ గిరిబాబు**
**- కోర్టు కానిస్టేబుళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి**



కొత్తకోట, అక్టోబర్ 04: (విజన్ ఆంధ్ర) :కొత్తకోట సీఐ కార్యాలయంలో శనివారం కొత్తకోట సర్కిల్ పరిధిలోని కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లతో వనపర్తి డీఎస్పీ గిరిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచడం, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించడం, నిందితులకు చట్టపరమైన శిక్షలు ఖచ్చితంగా పడేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ.. కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కేసు నమోదు అయినప్పటి నుంచి తుది తీర్పు వెలువడే వరకు ప్రతి దశను కోర్టు డ్యూటీ అధికారులు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించారు. కేసుల్లో నిందితుల నేరాన్ని నిరూపించేందుకు అవసరమైన రుజువులు, కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు తదితర ఆధారాలను సకాలంలో కోర్టుకు సమర్పించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సాక్షులు, బాధితులు నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, వారికి కేసుకు సంబంధించిన అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. కోర్టు నుంచి అందే సమాచారం, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్సైలు, దర్యాప్తు అధికారులకు చేరవేయాలని తెలిపారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, ప్రాసిక్యూషన్ మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని సూచించారు. అనంతరం పెండింగ్ కేసులు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్బీడబ్ల్యూ) అమలుపై డీఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసు పురోగతిని సంబంధిత కోర్టు డ్యూటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, కోర్టు జారీ చేసిన సమన్లు, వారెంట్లను సకాలంలో అమలు చేసి నిందితులను కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించారు. ప్రతి కేసును ఒక బాధ్యతగా భావించి, సాక్ష్యాధారాల సమర్పణ నుంచి నిందితులకు శిక్ష పడే వరకు నిరంతరం పర్యవేక్షించాలని డీఎస్పీ గిరిబాబు స్పష్టం చేశారు. కోర్టు కేసుల పర్యవేక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కొత్తకోట సీఐ ఓ.డి. రమేష్, కొత్తకోట ఎస్సై విక్రమ్, పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, కొత్తకోట సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు ఉన్నారు .

## అంగన్వాడీ, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) సమాజ ఆరోగ్య పరిరక్షణలో, పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని రాంనగర్, వల్లభ్‌నగర్ వార్డుల్లో ‘అంగన్ మిలాన్ సేవ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ?ఈ సందర్భంగా వార్డుల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తల పాత్ర అభినందనీయమని, వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, అనుజ్ఞ రెడ్డి, చిత్తారి ప్రభాకర్, అలివేలమ్మ, సుమిత్రమ్మ, వారణాసి కల్పన, భారతి, బత్తిని మధు, ఖలీల్, దాసరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోయిల్ కొండ తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో రైతు ఆత్మహత్య

**- భూ వివాదమే కారణమని తహశీల్దార్ వివరణ**
**- శవపరీక్ష నిమిత్తం మృతదేహం తరలింపు**






కోయిలకొండ అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం ఓ రైతు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తహశీల్దార్ జి.దీపక్‌రావు వెల్లడించారు.?మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్ కొండ మండలం పార్వల్లి గ్రామానికి చెందిన పసుల లావప్ప (50) శనివారం ఉదయం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందారు. ఉదయం సుమారు 6.30 గంటల ప్రాంతంలో సమాచారం అందడంతో వెంటనే ఉన్నతాధికారులకు, పోలీసులకు తెలియజేసినట్లు తహశీల్దార్ తెలిపారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పసుల కురుమూర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం... పార్వల్లి శివారులోని సర్వే నంబర్ 211లో ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించి కొంతకాలంగా కుటుంబ సభ్యుల మధ్య వివాదం కొనసాగుతోంది. దయ్యాలి లక్ష్మయ్య, పసుల చంద్రశేఖర్, పసుల విష్ణు, దయ్యాల రామకృష్ణలు తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించేందుకు ప్రయత్నించారని, పంట నష్టం కలిగించి తమ తండ్రిపై దాడికి బెదిరింపులకు పాల్పడ్డారని కుమారుడు ఆరోపించారు. మృతుడు రాసినట్లుగా భావిస్తున్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఆ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు కోరారు. సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు తహశీల్దార్ వెల్లడించారు. 1954–55 ఖస్రా పహాణీ ప్రకారం ఈ సర్వే నంబరులో 18.39 ఎకరాల పట్టా భూమి ఉండగా, టిప్పన్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలనలో 17.39 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ భూమి భౌతిక స్వాధీనంపై కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు ఉన్నాయని, అయితే ఈ సర్వే నంబర్‌లోని భూమితో మృతుడికి ఎలాంటి సంబంధం లేదని తహశీల్దార్ స్పష్టం చేశారు. మృతుడికి ఇద్దరు భార్యలు (కనకమ్మ, మంజుల) కాగా వారు ఇప్పటికే మృతి చెందారని, ఆయనకు ముగ్గురు కుమారులు (వేణుగోపాల్, కుర్మయ్య, గంగాధర్), కుమార్తె (నాగేశ్వరమ్మ) ఉన్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి సూసైడ్ నోట్, పోస్టుమార్టం నివేదిక, రెవెన్యూ రికార్డుల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసినట్లు తహశీల్దార్ దీపక్‌రావు వివరించారు.

## సింగోటం నరసింహస్వామి సేవలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : కృష్ణపక్ష అష్టమి, ఆర్ద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇంటి దైవమైన సింగోటం స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డితో కలిసి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబానికి వేద బ్రాహ్మణులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. ?ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అమ్మవారి సన్నిధిలో అర్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామివారి కృపతో వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## "కళ్యాణలక్ష్మి" అంటే కేసీఆర్!!

**- పేదింటి ఆడబిడ్డల ఆత్మీయ బంధువు**
**- రూపకర్త కేసీఆర్‌కు మహిళల కృతజ్ఞతలు**
**- సంక్షేమానికి ప్రతీక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్**
**- కోరుకంటి చందర్**





పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): ఒకప్పుడు పేద కుటుంబాల్లో ఆడపిల్ల వివాహం అంటే తల్లిదండ్రులకు భారమైన బాధ్యతగా భావించే పరిస్థితులు ఉండేవి. అలాంటి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వేలాది పెళ్లిళ్లను ఆనందోత్సవాలుగా మార్చిన కళ్యాణలక్ష్మి పథకం వెనుక ఉన్న దూరదృష్టి నాయకుడు కేసీఆర్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం రామగుండం నియోజకవర్గంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చందర్, తెలంగాణ ఏర్పడిన తర్వాత పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు సామాజిక మార్పుకు నాంది పలికారని అన్నారు. ఆడబిడ్డ పెళ్లి కోసం అప్పులు, ఆందోళనలతో సతమతమయ్యే కుటుంబాలకు ఈ పథకం ఆశాకిరణంగా మారిందని చెప్పారు. పదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 16.78 లక్షలకుపైగా పేద కుటుంబాలు కళ్యాణలక్ష్మి ద్వారా లబ్ధి పొందాయన్నారు. అయితే ప్రస్తుతం పథకం అమలులో జాప్యం చోటుచేసుకోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోందన్నారు. అందుకే పథకాన్ని అందించిన కేసీఆర్ పట్ల కృతజ్ఞతగా మహిళలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాలాభిషేకం నిర్వహించారని తెలిపారు. తెలంగాణలో మళ్లీ సంక్షేమానికి పెద్దపీట వేసే పాలన రావాలని మహిళలు, పేద కుటుంబాలు ఆకాంక్షిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ కళ్యాణలక్ష్మి వంటి పథకాలు నిరంతరంగా కొనసాగాలని కోరగా, మొత్తం కార్యక్రమం రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది.

## మహాత్మా గాంధీ శాంతి పురస్కారానికి మడిగల విజయభాస్కర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 03 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ సంఘ సేవకులు, అంతర్జాతీయ భారత మానవ హక్కుల కమిటీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగల విజయభాస్కర్ రెడ్డిని మహాత్మా గాంధీ శాంతి పురస్కారం–2026కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారం గాంధీ 157వ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవాల ముగింపు సందర్భంగా అక్టోబర్ 8న ఉదయం 10 గంటలకు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. శాంతి, మతసామరస్యం, పర్యావరణ పరిరక్షణ, నిరుపేదలకు విద్యా–వైద్య సహాయం, మొక్కల నాటకం, మహిళల హక్కులు, బాలల విద్య, రోడ్డు భద్రత, నిరాశ్రయులు, వృద్ధులకు సేవలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రొ.వి.బాలకృష్ణారెడ్డి, ప్రొ.సూర్య ధనంజయ్, రిటైర్డ్ జస్టిస్ వామన్ రావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## స్వచ్ఛతకు సింగరేణి శ్రీకారం!!

**- ఈ-వేస్ట్ నిర్వహణపై అవగాహన**
**- ఉద్యోగులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ**
**- స్వచ్ఛతే సామాజిక బాధ్యత : జీఎం**






పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): పరిశుభ్రమైన కార్యాలయాలు, పరిసరాలే ఆరోగ్యకరమైన జీవన విధానానికి నాంది అని సింగరేణి రామగుండం ఏరియా–1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ అన్నారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రామగుండం ఏరియా–1 జీఎం కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ స్వచ్ఛతా క్యాంపెయిన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, అక్టోబర్ 2 నుంచి 31 వరకు చేపట్టనున్న స్వచ్ఛతా కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యాలయాలు, పని ప్రదేశాలు, కాలనీలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ–వేస్ట్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. వినియోగానికి పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేరు చేసి, అధీకృత రీసైక్లింగ్ సంస్థల ద్వారా సక్రమంగా పారవేయడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు పరిశుభ్రత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీఎంపీఎఫ్ కార్యాలయ ఆవరణలోని పార్కులో జీఎం డి. లలిత్ కుమార్ స్వయంగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. స్వచ్ఛతలో అందరి భాగస్వామ్యం.. పర్యావరణ పరిరక్షణలో సింగరేణి ముందడుగు” అనే సందేశంతో కార్యక్రమం సాగింది.

## పారదర్శక ఓటరు జాబితా కోసం పకడ్బందీగా ఎస్.ఐ.ఆర్ అమలు

**- ఎన్నికల జాబితా పరిశీలకులు టీ.కే.శ్రీదేవి**
**- పోలింగ్ కేంద్రాల సందర్శన**
**- ఈ.ఆర్.ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష**




నిజామాబాద్, అక్టోబర్0 3 :( విజన్ ఆంధ్ర) అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండేలా తుది ఓటరు జాబితా రూపొందేలా సమిష్టిగా కృషి చేయాలని ఎన్నికల జాబితా పరిశీలకులు, రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా, పట్టణ ప్రణాళికా విభాగం సంచాలకులు టీ.కే.శ్రీదేవి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో కీలకమైనందున అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా తప్పిపోకుండా, అదే సమయంలో అనర్హులకు జాబితాలో చోటు లేకుండా ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. శనివారం ఆమె ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ జి.లహరి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాలతో కలిసి ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని మామిడిపల్లిలో గల 39వ పోలింగ్ స్టేషన్ ను, ఆర్మూర్ లోని 88వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్.ఐ.ఆర్ అమలు తీరు గురించి, వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేసిన విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎన్ని హియరింగ్ లు పూర్తయ్యాయి, ఎలా విచారణ జరుపుతున్నారు, ఏయే ధృవీకరణ పత్రాలను స్వీకరించారు, ఎంత మంది అన్ మ్యాపింగ్ ఓటర్లు ఉన్నారు, అనామలిస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఎంతమంది తదితర వివరాలను బీ.ఎల్.ఓలు రాంశంకర్, ప్రవళికలను అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ సక్రమంగా నమోదు చేయడం పట్ల ఎన్నికల జాబితా పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులతో (ఈ.ఆర్.ఓ), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల జాబితా పరిశీలకులు టీ.కే.శ్రీదేవి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఒక్కో నియోజకవర్గం వారీగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరుతెన్నుల గురించి ఈ.ఆర్.ఓలను అడిగి తెలుసుకున్నారు. నిజామాబాద్ అర్బన్ సహా మరికొన్ని సెగ్మెంట్లలో అన్ మ్యాపింగ్, అనామలిస్ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడాన్ని గమనించిన పరిశీలకులు, అందుకు గల కారణాలను కేటగిరీ వారీగా వివరిస్తూ సమగ్ర జాబితాను సమర్పించాలని ఆదేశించారు. హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో బీ.ఎల్.ఓల పనితీరును పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఈ.ఆర్.ఓలకు సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీ.ఎల్.ఓలు సమయ పాలన పాటిస్తూ, ఓటర్లకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను ఉద్దేశించి పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు తు.చ తప్పకుండా పాటిస్తూ, పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన జరిగేలా తోడ్పాటును అందించాలన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా క్రియాశీలక పాత్ర పోషిస్తూ, పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎక్కడైనా పొరపాట్లు, తప్పిదాలను గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పన బాధ్యత కేవలం అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘంది మాత్రమే అని భావించకుండా, అందరూ భాగస్వాములైనప్పుడే నిజమైన పారదర్శక జాబితా రూపొందుతుందని అన్నారు. రాజకీయ పార్టీల తరపున బీ.ఎల్.ఏలు క్షేత్రస్థాయిలో బీ.ఎల్.ఓలతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అదే సమయంలో అనర్హుల పేర్లు తొలగించబడేలా అంకిత భావంతో కృషి చేయాలని, ఈ బాధ్యతను బృహత్తర కార్యంగా భావిస్తూ సమర్థవంతంగా నిర్వర్తించాలని హితవు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, బాన్సువాడ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రవీందర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓ లు, సంబంధిత శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే--ఐజేయూ పోరాట ఫలితంగానే మూడో విడత అక్రిడేషన్ కార్డుల పంపిణీ

**- నియోజకవర్గ అధ్యక్షుడు మాలే రాజేందర్ గౌడ్ (సాక్షి రాజు)**



కొల్లాపూర్ అక్టోబర్ 3:(విజన్ ఆంధ్ర) : టీయూడబ్ల్యూజే--ఐజేయూ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరంతర పోరాటం, అధికారులపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగానే అర్హులైన జర్నలిస్టులకు మూడో విడత అక్రిడేషన్ కార్డులు పంపిణీ అయ్యాయని సంఘం కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాలే రాజేందర్ గౌడ్ (సాక్షి రాజు) తెలిపారు. కొల్లాపూర్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు మూడో విడత అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని గత కొంతకాలంగా సంఘం ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నిరంతరం ఒత్తిడి తెచ్చినట్లు గుర్తుచేశారు. ఇందులో భాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జర్నలిస్టుల ఆందోళనకు స్పందించిన అధికారులు శనివారం అర్హులైన వారికి అక్రిడేషన్ కార్డులను పంపిణీ చేశారని రాజేందర్ గౌడ్ తెలిపారు. కార్డులు అందుకున్న జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్య పరిష్కారానికి కృషి చేసిన టీయూడబ్ల్యూజే--ఐజేయూ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ, కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్ రావు, జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్‌లతో పాటు నాలుగు నియోజకవర్గాల నాయకులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఇంకా అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మసీదు బండకు వెళ్లే రైల్వే అండర్ పాస్ రోడ్డు అతి త్వరలోనే ప్రారంభం

**- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి. అక్టోబర్ 3: (విజన్ ఆంధ్ర) : హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీ లో గల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ. 70 లక్షల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనులను సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ మరియు జవీజ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన పిఎసి చైర్మన్ ఈ సందర్బంగా మాట్లాడుతూ మంజీరా పైప్ లైన్ రోడ్డు నుండి మసీదు బండ కు వెళ్లే రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ రోడ్డు ను అతి త్వరలోనే ప్రారంభిస్తామని, పనులు చివరి దశలో ఉన్నాయి అని, వారం రోజుల్లోగా ప్రజలకు అందుబాటులోకి తీసువస్తామని రైల్వే అండర్ పాస్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, ఉదయం , సాయంత్రం మరింత ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది అని, ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని రూ. 70 లక్షల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల పై అధికారులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలిపారు ఈ కార్యక్రమంలో జవీజ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఐజు ఆనంద్,ాాజు భాస్కర్ నాయకులు సత్యం కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో కూలిన సీలింగ్

**- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం**
**- దయనీయ స్థితిలో తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రులు**
**- పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం?**
**- వరంగల్ ఎంజీఎం ఘటన మరువకముందే భూపాలపల్లిలో మరో ఘటన**
**- ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు**



తెలంగాణ స్టేట్ బ్యూరో, భూపాలపల్లి, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో ప్రభుత్వ వైద్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందా? ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. తాజాగా జరిగిన ఘటనలు దీనికి నిదర్శనం. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో స్లాబ్ పెచ్చులు ఊడిపడి రోగులు భయాందోళనకు గురైన ఘటన మరువకముందే, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ ఘటన చోటుచేసుకుంది.

చిన్నపిల్లల వార్డులో కూలిన సీలింగ్:

జిల్లా కేంద్రంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో శనివారం సీలింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. పెద్ద శబ్దంతో సీలింగ్ పెచ్చులు, సిమెంట్ దిమ్మెలు కిందపడ్డాయి. ఆ సమయంలో అదృష్టవశాత్తూ వార్డులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ చిన్నారులు, బాలింతలు, తల్లులు అక్కడ ఉండి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో ఆసుపత్రి భవనం:

భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి భవనం ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదని, పైకప్పు నుండి నీరు కారుతోందని, గోడలకు పగుళ్లు వచ్చాయని రోగులు చెబుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వంపై విమర్శలు:

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల స్థితిగతులపై సమగ్ర సర్వే చేసి, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై వైద్యాధికారులు ఇప్పటివరకు స్పందించలేదు.

# గజ్వేల్ లో దుర్గమ్మ విగ్రహం ధ్వంసం



గజ్వేల్, 03 అక్టోబర్ 2026 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి (3వ వార్డు) గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలోని శ్రీ దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహం నేలకూలి ధ్వంసమైంది. విగ్రహం పడిపోయిన తీరును బట్టి, చూస్తే గుర్తుతెలియని దుండగులు కావాలనే అమ్మవారి విగ్రహాన్ని పగలగొట్టినట్లు స్పష్టమవుతోంది. ఈ ఘటనతో రాజిరెడ్డిపల్లి గ్రామస్థులు, భక్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆలయానికి భారీగా చేరుకున్న గ్రామస్థులు దుండగుల చర్యపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, ఈ అపచారానికి ఒడిగట్టిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించిన "ఆర్ ఆర్ డ్యాన్స్ స్టూడియో" డాన్స్ వేడుకలు







హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ.విశ్వనాథ్ ) : ప్రముఖ డాన్స్ అండ్ ఫిట్నెస్ శిక్షణ సంస్థ "ఆర్ ఆర్ డ్యాన్స్ స్టూడియో", గోవింద్ దోసా లైన్, ఆల్టోస్ కాంప్లెక్స్ పక్క సందు, డా. సోమాని క్లినిక్ ఎదురుగా, వీధి నెం.7, ఇంటి నెం. 3/6/560/ఎ హిమాయత్‌నగర్, హైదరాబాద్ వేదికలో , శుక్రవారం సాయంత్రం 'ఆర్ ఆర్ డాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో", వ్యవస్థాపక అధ్యక్షుడు, డాన్స్ డైరెక్టర్, కొరియోగ్రాఫర్, ప్రముఖ డాన్స్ అండ్ ఫిట్నెస్ గురువు రాఘవ్ రెడ్డి, అలాగే ' సి ఈ ఓ' సాక్షి వ్యాస్ నేతృత్వంలో కన్నుల పండుగగా నిర్వహించిన సంస్థ '3' సంవత్సరాల విజయోత్సవ వార్షికోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య వివిధ ఫిట్నెస్ నృత్యాంశాలను చేస్తూ వైభవంగా, ఘనంగా జరుపుకున్నారు. ఈ వార్షిక వేడుకలలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం డాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు డాన్స్ ,ఫిట్‌నెస్ తో కూడిన ఈ ఈవెంట్ లో సంతోషంగా పాల్గొని నృత్యాలు కేరింతలు చేస్తూ ఆనందంగా గడిపారు. విద్యార్థులు గురువులతో కలిసి ఎంతో పర్ఫెక్ట్ గా, ఆక్యురేట్ గా వివిధ డాన్సులు చేస్తూ డాన్స్ ప్రియులు అందరి అభిమానాన్ని, దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో రాఘవ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ 3 విజయవంతమైన సంవత్సరాలను జరుపుకుంటూ, కలిసి తమ 4వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో కేక్ కట్ చేసి విద్యార్థులందరికీ తినిపించారు. ఈ వేడుకలు అందరినీ కలుపుకుని వారిలో ఉత్సాహాన్ని జోష్ ని నింపుతూ నేత్రపర్వంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని రాఘవ్ రెడ్డి సంతృప్తిగా, సగర్వంగా తెలిపారు. శరీరాన్ని తీర్చిదిద్దుకోవడం, ఆనందంగా, ఫిట్ గా ఉండడం కోసం తాము జుంబా, డాన్స్ ఫిట్, బోలీ బీట్స్, టాలీ బీట్స్, ఫన్ డాన్స్ ఫిట్‌నెస్, పూర్తి శరీర టోనింగ్, క్రాస్ ఫిట్, బరువు తగ్గడం, స్టెప్స్ వర్కౌట్స్, హీట్ వర్కౌట్, కార్డియో అంశాలపై ఆర్ ఆర్ డాన్స్ స్టూడియో" లో శిక్షణ ఇస్తామని తెలుపుతూ, డాన్స్ క్లాసులు ఉదయం 7-8,మధ్యాహ్నం 11-12, అలాగే సాయంత్రం 4-5, రాత్రి 6:30-7:30 గంటల సమయాలలో నేర్పిస్తున్నామని రాఘవ్ రెడ్డి తెలియజేశారు. పూర్వ విద్యార్థిని, ఆర్ ఆర్ డాన్స్ స్టూడియో 'సీ ఈ ఓ' దీప్తి వ్యాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్యాన్స్,జుంబా షోకేస్, సరదా ఆటలు ప్రత్యేకమైనవి ఉత్తమ కాస్ట్యూమ్ అవార్డులు, పాల్గొనేవారికి సర్టిఫికేట్లు, ప్రత్యేక బహుమతులు ఈ వార్షిక వేడుకలలో హైలైట్ అని తెలిపారు. ఈ 3 సంవత్సరాలలో 1000 కు పైగా విద్యార్థులకు వివిధ డాన్సులు నేర్పించి వారిని గొప్ప డాన్సర్లుగా తీర్చిదిద్దామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఆర్ ఆర్ డ్యాన్స్ స్టూడియో వార్షిక వేడుకలలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్నేహితులు, డ్యాన్స్ టీచర్స్ పెద్ద సంఖ్యలో సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఇజ్జత్ నగర్‌లో ఘనంగా 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం





శేరిలింగంపల్లి.అక్టోబర్ 3: (విజన్ ఆంధ్ర) : ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి ఘన సన్మానం చేసి చిన్నారులకు ఆటవస్తువులు పంపిణీ చేసిన ...చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అంగన్‌వాడీల బలోపేతానికి, మహిళా శిశు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ,జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్ నేతృత్వంలో శేరిలింగంపల్లి పరిధిలోని ఇజ్జత్ నగర్‌లో నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నిస్వార్థ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మరియు ఆశా వర్కర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో సరదాగా గడిపి, వారితో మాట్లాడి ముచ్చటించారు. పిల్లల శారీరక, మానసిక ఉల్లాసానికి అవసరమైన పలు ఆటవస్తువులను వారికి స్వయంగా అందజేశారు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యం, సరైన పోషణపైనే ఆధారపడి ఉందని, అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. 'పోషణ్ అభియాన్', 'మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ' వంటి పథకాల ద్వారా కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులను నేరుగా కేటాయిస్తోందని గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించడం, పౌష్టికాహార లోపాన్ని నివారించడం మరియు గర్భిణులు, బాలింతలకు ఆర్థిక సహాయాన్ని అందించే 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన (ాపీవీవ్)' వంటి సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని కంటికి రెప్పలా కాపాడే అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. కేంద్ర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పేద వర్గాలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజ సేవలో బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుంటారని, సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజలకు చేరువవుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్, డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, ఆనంద్ కుమార్,వేణుగోపాల్ రెడ్డి, జితేందర్ , శ్రీనివాస్ రెడ్డి,భారతి లక్ష్మి, యాదమ్మ, పవన్ రెడ్డి, ఆశిక్ కుమార్,కురుమయ్య, గురు యాదవ్ ,బాల కుమార్, మోహన్ నాయక్ ,చంటి నాయక్,శివ యాదవ్,లోకేష్ ,మంజు, పట్టాభిరామ్, రోజా రమణి,ఆమని,మల్లేష్, రాము యాదవ్, నిఖిల్, బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు, స్థానిక డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కోర్టు కేసుల్లో జాప్యం వద్దు - నిందితులకు శిక్ష పడేలా పనిచేయండి: ఎస్పీ జానకి





తెలంగాణ స్టేట్ బ్యూరో,మహబూబ్ నగర్, అక్టోబర్ 3, విజన్ ఆంధ్ర: జిల్లాలో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా కోర్టు డ్యూటీ, లైజన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్ లో ఎస్పీ కోర్టు అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్ లో ఉన్న కేసులు, కోర్టు విచారణలు, సాక్షుల హాజరు, చార్జిషీట్ల దాఖలు, కోర్టు ఉత్తర్వుల అమలు తీరును ఆరా తీశారు. "కేసు నమోదు చేయడమే కాదు, దానికి న్యాయపరంగా ముగింపు పలకడం కూడా మన బాధ్యతే. రికార్డులు, డాక్యుమెంట్లు, సాక్ష్యాలను పకడ్బందీగా నిర్వహించాలి. కోర్టు నుండి వచ్చే ప్రతి సమన్, వారెంట్ ను సకాలంలో అమలు చేయాలి. పెండింగ్ కేసులపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి" అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చీదీ రత్నం, ఐజ=దీ ఖూా రమణా రెడ్డి, వర్టికల్ డి.ఎస్.పి బాలాజీ, జజూ ఇన్ స్పెక్టర్ రవి బాబు, ఖజ ఇన్ స్పెక్టర్ గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*రాష్ట్ర స్థాయిలో మహబూబ్ నగర్ పోలీసుల సత్తా*
*- రెండు పతకాలు కైవసం*

హైదరాబాద్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2026 లో మహబూబ్ నగర్ జిల్లా పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్ లో డార్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ లింగం, టూ టౌన్ాా హెడ్ కానిస్టేబుల్ శేఖర్ ద్వయం రజత పతకాన్ని (ాఅశ్రీజవతీ వీవఋశ్రీ) గెలుచుకున్నారు. అదే విధంగా లాన్ టెన్నిస్ డబుల్స్ లో ఐూా= కు చెందిన హెడ్ కానిస్టేబుల్స్ ఇమ్రాన్, లింగం జోడీ కాంస్య పతకాన్ని (దీతీశీఅఓవ వీవఋశ్రీ) సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పతక విజేతలను ఎస్పీ జానకి ఘనంగా అభినందించారు."విధి నిర్వహణలోనే కాదు, క్రీడల్లోనూ మన సత్తా చాటడం గర్వకారణం. క్రీడలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంచుతాయి. మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తేవాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్టికల్ డి.ఎస్.పి బాలాజీ, ఎస్పీ సీసీ రామ్ రెడ్డి, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ రవిబాబు, డీటీసీ ఇన్ స్పెక్టర్ గోవింద రెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్ స్పెక్టర్ కమలాకర్,ఆర్ఐ లు కృష్ణయ్య, నగేష్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్యారసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఈసీదే

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**- సిఇసి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి**
**- తొలగించిన అర్హులైన ఓట్లను పునరుద్ధరించాలి**
**- వనపర్తిలో అఖిలపక్ష నాయకులతో కలిసి విలేకరుల సమావేశం**




వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర) : దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించడంలో ఎన్నికల కమిషన్ పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా కేవలం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది సామాన్య పౌరుడికి ఉన్న అత్యంత శక్తివంతమైన హక్కు అని, దానిని కాపాడటం ఈసీ ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**'ఎస్ ఐఆర్' ప్రక్రియపై తీవ్ర అభ్యంతరం**

' ఎస్ ఐఆర్ ' పేరుతో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో ఒక్క అర్హుడి పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదని, ఓటు హక్కు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, పేరు తొలగించిన పౌరుడికి దానికి గల కారణం తెలియజేయడంతో పాటు అభ్యంతరం తెలుపుకునే అవకాశం కల్పించాలని అన్నారు. ముఖ్యంగా పేదలు, సామాన్యులు, వలస కార్మికులు, వృద్ధుల ఓటు హక్కుకు భంగం వాటిల్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో పోరాటం**

ఎన్నికల కమిషనర్ల నియామక విధానం, ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న సందేహాలను కేంద్ర ప్రభుత్వం, ఈసీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు కేంద్రం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

అర్హులైన ఓటర్ల పేర్ల పునరుద్ధరణ, ఎస్ ఐఆర్ ప్రక్రియ రద్దు, ఎన్నికల సంఘం స్వతంత్రత పరిరక్షణ అంశాలపై 'ఇండియా' కూటమి తరఫున నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అఖిలపక్ష పార్టీల నాయకులు సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జబ్బార్, డి. కురుమయ్య, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రహీం, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా, బాబు గౌడ్, గణేష్, మండ్ల రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కోళ్ల వెంకటేష్, బి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**- జిల్లా బాలల సంరక్షణ అధికారి ఓంకార్**



ములుగు అక్టోబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మండలం దేవగిరి పట్నం గ్రామంలో జాతీయ పోషణ నెల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లిజిల్లా బాలల సంరక్షణ అధికారి ఓంకార్‌లి మాట్లాడుతూ బాలల హక్కులు, బాలల సంరక్షణ, పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చారు. పిల్లల రక్షణకు సమాజం అంతా కలిసి పని చేయాలని సూచించారు. సెక్టారు పర్యవేక్షకురాలు కావ్య మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లలకు పోషకాహారం విలువ తెలియజేయాలని, జంక్ తిండి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, పండ్లు వంటి బలవర్ధకమైన ఆహారం పెట్టాలని తల్లులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇస్లావత్ పూలమ్మ, వార్డు సభ్యులు, మహిళా కేంద్రం ప్రతినిధి శిరీష, మండల బాలల సంరక్షణ సలహాదారు సంధ్య, బాలల సహాయ వాణి ప్రతినిధి నాగమణి, సఖీ ప్రతినిధి మౌనిక, కోనేరు సేవా సంస్థ సమన్వయకర్త రమేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పోషణ మాస ప్రతిజ్ఞ చేశారు.

## రాయినిగూడెం పీహెచ్‌సీని 24 గంటల ఆసుపత్రిగా మార్చా

**- రాయంచు నాగరాజు**



ములుగు అక్టోబరు 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మండల రాయినిగూడెం గ్రామ పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలపై బీజేపీ మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. వైద్యులు రోస్టర్ విధానంలో ఉండడం, మందులు, సిబ్బంది కొరతతో గిరిజన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. శాశ్వత వైద్యుడిని నియమించి పీహెచ్‌సీని 24 గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణాకర్ రావు, రాజ్ కుమార్, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం,

**సాగు విధానం, నీటి లభ్యతపై రైతులతో వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



అచ్చంపేట అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా ఉపయోగపడుతుందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామంలో రైతులు శ్యాంసుందర్ రెడ్డి, హనుమంత రెడ్డి తమ 8 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌ఫామ్ సాగు కోసం తీసుకువచ్చిన 400 మొక్కలను ఏర్పాటు చేస్తున్న విధానాన్ని అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్ర తో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆయిల్‌ఫామ్ సాగుకు అవసరమైన నీటి లభ్యత, మొక్కలు నాటే విధానం, మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇప్పటివరకు అయిన వ్యయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌ఫామ్ సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పోలిశెట్టిపల్లి క్లస్టర్ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై జరిగిన కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం వీరాంరామాపల్లి గ్రామంలో సెంట్రల్ కిచెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటల సాగు, పెంపకానికి అనువైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో సెంట్రల్ కిచెన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్థానికంగా సాగు చేసి వినియోగించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, అచ్చంపేట డివిజన్ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# కల్వకుర్తిలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**

కల్వకుర్తి, అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ ముందు అర్ధరాత్రి జరిగిన పల్సర్ బైక్ ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి బలరాం నగర్ కాలనీకి చెందిన రూపేష్ (దేవరకొండ రవణీష్) అనే యువకుడు తన స్నేహితులు సుంకే మునిందర్ గౌడ్, వీరు చెన్ను నవనీత్ (చాణిక్య) లతో కలిసి టీూ 31 జీ 1513 నంబర్ గల పల్సర్ బైక్ పై అక్టోబర్ 2 రాత్రి 11 గంటలకు జీూ నగర్ వైపు వెళ్తుండగా, అక్టోబర్ 3 అర్ధరాత్రి 1:30 గంటలకు ప్రభుత్వ హాస్పిటల్ ముందు బైక్ అదుపుతప్పి స్లిప్ అయింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రూపేష్ కు తలపై బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ పై వెనుక కూర్చున్న మునిందర్ గౌడ్ కు తలకు, శరీర భాగాలకు, నవనీత్ అలియాస్ చాణిక్య కు తలకు, ఛాతికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట కల్వకుర్తి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా, మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ హైదరాబాద్ లోని గాంధీ హాస్పిటల్ మరియు ూమీూ హాస్పిటల్ కు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ... మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

# ఆరోగ్యాన్ని మింగేస్తున్న స్క్రీన్ టైమ్!!




- కాంక్రీట్ అడవుల్లో మట్టి వాసన కరువు
- రోజూ గంట.. ఆరోగ్యానికి బాట
- మట్టిలోనే ఆరోగ్య మహిమ
- ఒత్తిడి సుడిగుండంలో పెద్దలు
- వయసుతో పనిలేదు.. ఆట తప్పనిసరి

హైదరాబాద్ ( హెల్త్ డెస్క్ ), అక్టోబర్ 3: సూర్యోదయపు లేలేత కిరణాలు పలకరించగానే వీధుల్లోకి పరుగులు తీసే పిలకల సందడి... గోలీలాటల సవ్వడులు, బొంగరాల గిరికీలు, మట్టిలో దొర్లి ఇళ్లకు చేరితే అమ్మ వేసే ముద్దుల మొట్టికాయలు... ఇవన్నీ ఇప్పుడు కేవలం నేటి రీల్స్‌కు మాత్రమే పరిమితమైన జ్ఞాపకాలు. నేడు పొద్దున లేస్తే అలారం ఆపడం మొదలు, అర్ధరాత్రి కళ్లు మూసే దాకా అరచేతిలోని నీలి వెలుతురు (బ్లూ లైట్) బంధీలే. పసిపిల్లల బుజ్జగింపులకు యూట్యూబ్, యువత కాలక్షేపానికి అంతులేని రీల్స్ స్క్రోలింగ్, పెద్దల కెరీర్ రేసుకు మానిటర్ తెరలు. క్షణం తీరిక లేకుండా స్వైప్ చేస్తూ, మనకు తెలియకుండానే జీవితాన్ని, ఆరోగ్యాన్ని ఆ చిన్న తెరకే ధారపోస్తున్నాం.




**కాంక్రీట్ అడవుల్లో మట్టి వాసన కరువు**

ఆకాశహర్మ్యాలు, అపార్ట్‌మెంట్ల బాల్కనీలు, గేటెడ్ కమ్యూనిటీల గేట్ల మధ్య నేటి తరం బాల్యం బిగుసుకుపోయింది. ఒకప్పుడు వాన పడగానే నేల నుంచి వచ్చే మట్టి సువాసన పిల్లల మనసుల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపేది. ఇప్పుడు ఆ మట్టి వాసన కూడా ప్యాక్ చేసిన అత్తరు సీసాల రూపంలో వెతుక్కోవాల్సిన దుస్థితి. స్నేహితులను కలవడానికి వీడియో గేమ్‌లు, ఆడుకోవడానికి స్మార్ట్‌ఫోన్ యాప్‌లు సరిపోతున్న ఈ రోజుల్లో... పిల్లల మోకాళ్లపై మట్టి మరకల స్థానంలో, లేత కళ్లపై దళసరి అద్దాలు వచ్చి చేరుతున్నాయి. చిన్న వయసులోనే స్థూలకాయం, డిప్రెషన్, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు భవిష్యత్ తరాలను కుంగదీస్తున్నాయి.




**మట్టిలోనే అసలైన ఆరోగ్య రహస్యం**

వైద్యశాస్త్రం చెబుతున్న సత్యం ఒక్కటే. ప్రకృతితో, నేలతో సంబంధం తెగిపోయినప్పుడే రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. మట్టిలో ఆడుకున్నప్పుడు శరీరానికి అందే మేలు చేసే బ్యాక్టీరియా (మైక్రోబయోమ్) రోగనిరోధక వ్యవస్థను ఉక్కులా మారుస్తుంది. ఆకుపచ్చని చెట్లు, పచ్చికపై నడిచే అడుగులు శరీరంలో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వికిరణాల ఒత్తిడిని హరించి వేస్తాయి. ఎర్తింగ్ అనేది ఆధునిక కాలంలో అతిపెద్ద థెరపీగా మారింది.

**ఒత్తిడి సుడిగుండంలో పెద్దలు.. తప్పనిసరి ఆట**

ఒకవైపు ఈఎంఐల భారం, మరోవైపు కార్పొరేట్ డెడ్‌లైన్లు, ఇంకోవైపు డిజిటల్ నోటిఫికేషన్ల హోరు. నలభై ఏళ్లకే నడుంనొప్పులు, గుండెజబ్బులు, నిద్రలేమితో జీవచ్ఛవాల్లా మారుతున్న పెద్దలకు నిజంగా కావాల్సింది ఖరీదైన జిమ్ సబ్‌స్క్రిప్షన్లు మాత్రమే కాదు; కాసేపు మనసు విప్పి చెమట పట్టేలా ఆడే ఆట. ఆటలకు వయసుతో నిమిత్తం లేదు. బ్యాడ్మింటన్ రాకెట్ పట్టినా, మైదానంలో పరుగు తీసినా, వీధి చివర సరదాగా క్రికెట్ ఆడినా శరీరంలో విడుదలయ్యే 'ఎండార్ఫిన్లు' ఒత్తిడిని మాయం చేస్తాయి. అలసిపోయిన మెదడుకు సరికొత్త రీఛార్జ్ ఇస్తాయి.

**రోజూ గంట.. ఆరోగ్యానికి సరికొత్త బాట**

డిజిటల్ ప్రపంచాన్ని పూర్తిగా వదిలేయడం నేటి కాలంలో అసాధ్యం కావచ్చు. కానీ మన జీవనశైలికి పరిమితులు విధించుకోవడం మన చేతుల్లోనే ఉంది. రోజులో కనీసం ఒక్క గంట పాటు మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు పక్కన పెట్టి డిజిటల్ డిటాక్స్ పాటించాలి. ఆ గంట సమయాన్ని పిల్లలతో కలిసి మైదానంలో గడపడానికో, నడకకో లేదా ఏదైనా ఇష్టమైన క్రీడకో కేటాయించాలి. పాదాలకు నేల తాకాలి, శరీరానికి సూర్యరశ్మి సోకాలి, ఊపిరితిత్తుల్లోకి స్వచ్ఛమైన గాలి చేరాలి. స్క్రీన్ల మాయాజాలంలో కరిగిపోతున్న నిజమైన జీవితాన్ని తిరిగి చేజిక్కించుకుందాం. మట్టిని తాకుదాం.. మనుషుల మధ్య నవ్వులను పంచుకుందాం. ఆరోగ్యకరమైన రేపటి కోసం ఇప్పుడే తొలి అడుగు వేద్దాం.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**



# గర్భిణీల ప్రాణాలతో చెలగాటమా..?

- 15 ఏళ్లుగా అధ్వాన్న రహదారి..!
- ఆసుపత్రికి వెళ్లాలంటే నరకయాతనే..!
- అభివృద్ధికి దూరంగా గిరిజన గూడేలు..
- జిల్లా యంత్రాంగం చొరవ చూపాలంటున్న ప్రజలు..

*కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలు, తండాలకు సరైన రహదారి సౌకర్యం లేక అభివృద్ధికి ఆమడ దూరంలో వెనుకబడుతున్నాయి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయాల్లో ఆసుపత్రులకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రహదారి దుస్థితి కారణంగా ప్రయాణ సమయం పెరిగే పరిస్థితి ఉంది. ఈ సమస్యపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి గిరిజన ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.*

లింగాపూర్, అక్టోబర్ 3(విజన్ ఆంధ్ర ): లింగాపూర్ నుంచి జాముల్ధరా మీదుగా పెద్ద దంపూర్, చిన్న దంపూర్, ఖిమా నాయక్ తండా ప్రాంతాలను కలుపుతూ పంగడి మాదోరా వైపు వెళ్లే రహదారికి బీటీ రోడ్డు నిర్మాణం అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ రహదారి అనేక ఆదివాసీ గిరిజన గ్రామాలు, తండాల ప్రజలకు రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉందని, రహదారి పరిస్థితి సరిగా లేక విద్యార్థులు, రైతులు, కూలీలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో లింగాపూర్ నుంచి పంగడి మాదోరా వైపు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ, సంవత్సరాలుగా సరైన మరమ్మతులు, నిర్వహణ లేక రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుతం గుంతలు, రాళ్లు, మట్టి కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ప్రమాదాల ముప్పుతో ప్రయాణించాల్సి వస్తోంది. సుమారు 30 కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా మారి, దాదాపు 15 ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల వైద్యం, విద్య, వ్యవసాయం, ఉపాధి తదితర అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గర్భిణీలకు అత్యవసర రవాణా సౌకర్యం అవసరం. గర్భిణీ స్త్రీలను ప్రసవ సమయాల్లో ఆసుపత్రులకు తరలించేందుకు సురక్షితమైన, అన్ని కాలాల్లో ప్రయాణించగల రహదారి అత్యంత అవసరమైనది. రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి రావడం, ప్రయాణ సమయం పెరగడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. అత్యవసర వైద్య పరిస్థితుల్లో సమయం ఎంతో కీలకమైనందున గిరిజన ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఖిమా నాయక్ తండా వద్ద వంతెన అత్యవసరం.. అలాగే దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న దంపూర్ ఖిమా నాయక్ తండా వద్ద వంతెన నిర్మాణం



అత్యవసరంగా చేపట్టాలి. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించేలా వంతెన నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా జాముల్ధరా నుంచి చిన్న దంపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మించి, పంగడి మాదోరా వైపు ఉన్న ప్రధాన రహదారితో అనుసంధానం చేయాలి. చిన్న దంపూర్, ఖిమా నాయక్ తండా సహా పరిసర ఆదివాసీ గిరిజన గ్రామాలు, తండాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది. రహదారి లేక అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన ప్రాంతాలు... రహదారి వ్యవస్థ బాగుంటేనే గ్రామాలకు విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెట్లు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం రహదారి సమస్య కారణంగా ఆదివాసీ గిరిజన గ్రామాలు, తండాలు అభివృద్ధిలో వెనుకబడుతున్నాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం రహదారి నిర్మాణాన్ని కేవలం రవాణా సమస్యగా కాకుండా, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధికి సంబంధించిన మౌలిక వసతుల సమస్యగా చూడాలి. జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలి.... జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి లింగాపూర్--జాముల్ధరరా--దంపూర్--చిన్న దంపూర్--ఖిమా నాయక్ తండా--పశీగడి మాదోరా రహదారి మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. సంబంధిత రోడ్లు--భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి బీటీ రోడ్డు, రహదారి పునర్నిర్మాణం, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలి. అలాగే అటవీ శాఖ అధికారులు కూడా ఆదివాసీ గిరిజన ప్రాంతాల అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా అవసరమైన సహకారం అందించాలి. రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులు, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధికారులు కలిసి పనిచేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. గిరిజన ప్రజల అభివృద్ధికి అడ్డంకులు లేకుండా జిల్లా యంత్రాంగం, రోడ్లు--భవనాలు, పంచాయతీరాజ్, అటవీ శాఖలు సమన్వయంతో ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇకనైనా గిరిజన ఆదివాసీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.15 ఏళ్లుగా కొనసాగుతున్న రహదారి సమస్యను ఇకనైనా అధికారులు అత్యవసరంగా పరిగణించాలి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, చిన్నారులు, అత్యవసర వైద్యం అవసరమైన ప్రజలు ఇబ్బందులు పడకుండా లింగాపూర్--పంగడి మాదోరా రహదారి అభివృద్ధి, దంపూర్ ఖిమా నాయక్ తండా వద్ద వంతెన నిర్మాణం, జాముల్ధరా--చిన్న దంపూర్ బీటీ రోడ్డు నిర్మాణానికి వెంటనే కార్యాచరణ ప్రారంభించాలి. ఆదివాసీ గిరిజన గ్రామాలు, తండాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండకుండా.. రహదారి సౌకర్యం ద్వారా ప్రభుత్వ సేవలు, వైద్యం, విద్య, ఉపాధి ప్రజలకు చేరువయ్యేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని గిరిజన ఆదివాసీ సమాజం వేడుకుంటున్నారు.


విజన్ ఆంధ్ర
02 Oct 2026 - Page 1
epaper.visionandhra.in
పసిపిల్లల కూటికి కన్నం?
- అంగన్వాడీ పోషకాహారం ఓ 'అంగట్లో' ప్రత్యక్షం!
- రాత్రి వేళ కావడం వల్లే కిరాణం కొట్టులో దింపేమంటున్న టీచర్, ఆయాల వింత సమర్థన?
- ఐసిడిఎస్ అధికారుల మామూళ్ల మత్తు, నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు
- బాధ్యులపై కఠిన చర్యలకు స్థానికుల డిమాండ్
- విచారణ చేపడతామన్న ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్
విజన్ ఆంధ్ర
02 Oct 2026 - Page 2
epaper.visionandhra.in
పసిపిల్లల కూటికి కన్నం?

# విజన్ ఆంధ్ర ఎఫెక్ట్......

# అంగన్వాడీ అక్రమాలపై కదిలిన ఐసిడిఎస్ యంత్రాంగం

- పెంట్లవెల్లి 10వ అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేసిన సిడిపిఓ, మండల సూపర్‌వైజర్
- సర్పంచ్ చిట్టెమ్మతో కలిసి రికార్డుల పరిశీలన
- టీచర్, ఆయాలకు సస్పెన్షన్ వేటు తప్పదా?
- రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని మెమో జారీ!




కొల్లాపూర్ /?పెంట్లవెల్లి 3 (విజన్ ఆంధ్ర) గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు అందించాల్సిన అంగన్వాడీ పోషకాహారం (స్టాంపు గుడ్లు) పక్కదారి పట్టి ప్రైవేటు కిరాణా కొట్టులో విక్రయానికి రావడంపై 'విజన్ ఆంధ్ర' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఐసిడిఎస్ అధికారులు వెంటనే స్పందించారు. "పసిపిల్లల కూటికి కన్నం? అంగన్వాడీ పోషకాహారం ఓ 'అంగట్లో' ప్రత్యక్షం!" శీర్షికన ప్రచురితమైన సంచలనాత్మక వార్తతో శాఖాపరంగా కదలిక వచ్చింది. ?ఈ వార్తా కథనానికి తక్షణమే స్పందించిన కొల్లాపూర్ సిడిపిఓ పెంట్లవెల్లి



మండల సూపర్‌వైజర్ శుక్రవారం మధ్యాహ్నం పెంట్లవెల్లి గ్రామ సర్పంచ్ చిట్టెమ్మతో కలిసి గ్రామంలోని 10వ అంగన్వాడీ కేంద్రాన్ని ,కిరాణా కొట్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లోని పోషకాహార నిల్వలు, స్టాక్ రికార్డులు, రిజిస్టర్లను తీవ్రంగా పరిశీలించారు.

***రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలి!***

ప్రభుత్వ ఆస్తి అయిన కోడిగుడ్లను ప్రైవేటు కిరాణా షాపులో దింపడం, నిల్వ ఉంచడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన అధికారులు.. బాధ్యులైన అంగన్వాడీ టీచర్, ఆయాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు గానూ సదరు టీచర్, ఆయాలకు రెండు రోజుల్లోగా (48 గంటల్లో) రాతపూర్వకంగా వివరణ ఇచ్చేలా (ఎక్స్‌ప్లనేషన్) మెమో జారీ చేశారు. ?ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారులు మాట్లాడుతూ.. పేద పిల్లల ఆహారాన్ని పక్కదారి పట్టిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టీచర్, ఆయాలు ఇచ్చే వివరణ ఆధారంగా సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి, బాధ్యులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

***విజన్ ఆంధ్ర'కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు***

ప్రభుత్వ సొత్తును పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కుల గుట్టు రట్టు చేసి, అధికారుల కళ్లు తెరిపించిన 'విజన్ ఆంధ్ర' పత్రిక యాజమాన్యానికి, పెంట్లవెల్లి గ్రామస్తులు, స్థానిక ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని మండల ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారుల గ్రామ సర్పంచి చిట్టెమ్మ తదితరులు గ్రామస్తులు ఉన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.